బుధవారం
24-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 331
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కేకేఈకి పెరిగిన ఎంపీలు

గ్రీస్‌లో ఈనెల 21న జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ)కి గణనీయంగా ఓట్లు పెరిగాయి. 2019 ఎన్నికలతో పోల్చితే 40శాతం ఎక్కువ ఓట్లు ఈసారి వచ్చాయి. పార్టీల ఎంపీల సంఖ్య దాదాపు రెట్టింపు అయింది.

2లో

మెరిసిన తెలుగు తేజాలు

ఇషితా కిశోర్

ఉమా హారతి

పవన్ దత్తా

శివ మారుతి రెడ్డి

- తెలంగాణ విద్యార్థినికి మూడో ర్యాంకు
- యూపీఎస్సీ పరీక్షల్లో సత్తా చాటిన మహిళలు
- మొదటి నాలుగు స్థానాలు వారివే

న్యూఢిల్లీ: సివిల్స్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తాచాటారు. తెలంగాణకు చెందిన నూకల ఉమా హారతి ఆలిండియా మూడో ర్యాంకు సాధించారు. ఆంధ్రప్రదేశ్, తిరుపతికి చెందిన జీవీఎస్ పవన్ దత్తా 22వ ర్యాంకులో నిలిచారు. వీరితో పాటు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించారు. ఢిల్లీ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ ఇషితా కిశోర్ మొదటి ర్యాంకు సాధించగా రెండో, నాలుగో స్థానాల్లో గరీమా లోహియా (డీయూ), స్మృతి మిశ్రా (డీయూ) నిలిచారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పరీక్షల్లో వనితలు వరుసగా రెండో ఏడాది టాప్ 3లో మెరిశారు. యూపీఎస్సీ-2022 పరీక్షా ఫలితాలు మంగళవారం విడదలయ్యాయి. మొత్తం 933 (613 పురుషులు- 320 మంది మహిళలు)

- మిగతా 2 లో

అవినాశ్‌కు చుక్కెదురు

- సీబీఐ అరెస్టుపై జోక్యం చేసుకోలేమని సుప్రీం స్పష్టీకరణ
- రేపు విచారించాలని తెలంగాణ హైకోర్టుకు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణ ఎదుర్కొంటున్న కడప ఎంపీ అవినాశ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అవినాశ్ ముందస్తు బెయిలు, సీబీఐ అరెస్టు విషయంలో జోక్యానికి సుప్రీం నిరాకరించింది. అయితే ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. అవినాశ్ ముందస్తు బెయిల్‌పై మే 25న విచారణ జరపాలని హైకోర్టు వెకేషన్ బెంచ్‌కి సుప్రీంకోర్టు తెలిపింది. అదేరోజు విచారణ ముగించేందుకు ప్రయత్నించాలని సూచించింది. అన్ని పక్షాలు వెకేషన్ బెంచ్ ముందే వాదనలు వినిపించాలని ఆదేశించింది. అప్పటివరకు అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయకుండా, విచారించకుండా వారం రోజులపాటు మినహాయింపు ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాది విజ్ఞప్తి చేయగా అందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు సిద్ధంగా లేమని జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహాతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది.

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తాను దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ విచారించేలా తెలంగాణ హైకోర్టును ఆదేశించాలని కోరుతూ అవినాశ్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. తన తల్లికి అనారోగ్యం కారణంగా సీబీఐ విచారణకు వారం రోజుల పాటు మినహాయింపు ఇవ్వాలని అవినాశ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. 'వచ్చే నెల 6న తెలంగాణ హైకోర్టులో పిటిషన్ విచారణకు వచ్చేవరకు అరెస్టు చేయకుండా ఆదేశించండి.

లేదంటే ఈ నెల 25న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారించాలని ఆదేశించి అప్పటి వరకు అరెస్టు చేయొద్దని ఉత్తర్వులివ్వండి' అని అవినాశ్ అభ్యర్థించారు. ఈ హత్య కేసు దర్యాప్తును విచారణ కోర్టు పర్యవేక్షించవచ్చా.. లేదా? అన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి దాఖలు చేసిన దరఖాస్తును ఆయన దరఖాస్తుతో కోర్టు జత చేసింది. ఈ రెండింటినీ కలిపి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహాతో కూడిన వెకేషన్ ధర్మాసనం విచారించింది.

డబ్బులు దండిగా వచ్చినా

మళ్లీ రూ.2 వేల కోట్ల అప్పు

ప్రత్యేక సాధారణ ఆర్థిక సాయం రూ.10,461 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రతి మంగళవారాన్ని అప్పులవారంగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం... ఈ వారం కూడా మరో రూ.2వేల కోట్లు అప్పు చేసింది. సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రిజర్వు బ్యాంకు నుంచి రూ. రెండు వేల కోట్ల రుణం తీసుకుంది. వీటిలో రూ. వెయ్యి కోట్లు 11 సంవత్సరాలకు 7.36 శాతం వడ్డీ, మరో వెయ్యి కోట్లు 15 సంవత్సరాలకు 7.30 శాతం వడ్డీ చెల్లించాలి. అయితే 2014-15 రెవెన్యూలోటు కింద ప్రత్యేక సాధారణ ఆర్థిక సాయంగా కేంద్రప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా అనూహ్యంగా ఒకేసారి రూ.10,461 కోట్లు విడుదల చేసింది. ఆ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మహేంద్ర చండేలియా ఆదేశాలిచ్చారు. దీంతో ఇప్పటివరకు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర

- మిగతా 2 లో

దిల్లీలో జి20 సదస్సు

మితిమీరిన కూల్చివేతల పర్వం

- కేంద్రంలోని బీజేపీ పాలకుల బుల్డోజర్ చర్యలు
- పెద్ద సంఖ్యలో నిరాశ్రయులైన ప్రజలు
- హక్కుల కార్యకర్తల ఆరోపణ

న్యూఢిల్లీ: కేంద్రంలోని పాలక బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలు మితిమీరిపోయాయి. అంతర్జాతీయ సదస్సులకు ఆతిథ్యమిచ్చే నగరాల సుందరీకరణ వంకతో పేదలను నిరాశ్రయులను చేసే దురహంకార చర్యలకు ఒడిగడుతోంది. విదేశీ ప్రతినిధులకు దేశంలో పేదలే కనిపించకూడదన్న లక్ష్యంతో ఆక్రమణదారులంటూ పేదల ఇళ్లపై బుల్‌డోజర్‌లతో విరుచుకుపడుతోంది. ప్రజల జీవన హక్కులను కాలరాస్తోంది. ఇప్పటి వరకు ఇటువంటి చర్యల వల్ల పట్టణ, గ్రామీణ భారతదేశంలోని 2.07 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఢిల్లీ, ఇతర నగరాల్లో జి20 సదస్సు సంబంధిత కార్యక్రమాలను నిర్వహించడం వల్ల అనేక మందిని నిరాశ్రయులయ్యేలా తొలగింపులు, కూల్చివేతలు తీవ్రమయ్యాయని హక్కుల కార్యకర్తలు ఆరోపించారు. సోమవారం ఇక్కడ జరిగిన బహిరంగ విచారణలో పౌర సమాజం, సంఘం సభ్యులు తొలగింపులు, ఆక్రమణల వ్యతిరేక కార్యక్రమాల వివరాలను పంచుకున్నారు. వివిధ రంగాలకు చెందిన సంస్థల సముదాయమైన కన్సర్న్డ్ సిటిజన్స్ ఈ విచారణను నిర్వహించింది. సెప్టెంబరులో ప్రభుత్వాలు, రాష్ట్రాల అధిపతుల సమావేశంతో సహా ఎనిమిది జి20 కార్యక్రమాలకు దిల్లీ ఆతిథ్యం ఇస్తున్నందున, వివిధ అధికారుల ఆక్రమణ వ్యతిరేక కార్యక్రమాల మధ్య ఎక్కువ మంది ప్రజలు తొలగింపు నోటీసులు పొందడం ప్రారంభించారని కార్యకర్తలు పేర్కొన్నారు. ల్యాండ్ కాన్‌ఫ్లిక్ట్ వాచ్‌కు చెందిన పృథ్వీరాజ్ మాట్లాడుతూ 'నవంబరులో భారతదేశానికి జి20 ఆతిథ్యం వచ్చింది. దీంతో దిల్లీలోని ప్రజలకు అకస్మాత్తుగా నోటీసులు రావడం ప్రారంభించాయి' అని తెలిపారు. ఇటీవల కూల్చివేతలు పేదలకు హాని కలిగిస్తాయని అన్నారు. 'మెహ్రౌలీలో 700 తొలగింపు నోటీసులు అందించారు. అయితే 25 ఇళ్లు కూల్చివేశారు. తుగ్లకాబాద్‌లో దాదాపు 1,500 నోటీసులు అందించారు. నివాసితులు అత్యంత పేదలు అయినందున సుమారు 3 వేల ఇళ్లు కూల్చివేశారు' అని పృథ్వీరాజ్ చెప్పారు. రెండు చోట్లా ఎక్కువ సంపన్నుల ఇళ్లు లేదా అపార్ట్‌మెంట్లను తప్పించారని ఆరోపించారు. యమునా వరద ప్రభావిత ప్రాంతమైన బేలా ఎస్టేట్ నుంచి తొలగించబడిన తరువాత ఇప్పుడు ఫ్లైఓవర్ కింద నివసిస్తున్న పూజ మాట్లాడుతూ తమ ఇళ్లను కూల్చివేసే ముందు తమ వస్తువులను తరలించుకునేందుకు కేవలం మూడు గంటల సమయం మాత్రమే ఇచ్చారని చెప్పారు. 'ఇది అసాధ్యానికి పక్కనే ఉంది. ఏప్రిల్ 29న తొలగింపు కార్యక్రమం కారణంగా చాలా మంది విద్యార్థులు తమ బోర్డు పరీక్షలకు దూరమయ్యారు. ఒక నెలలోనే మాపై మూడుసార్లు బుల్‌డోజర్‌లు విరుచుకుపడ్డాయి' అని పూజ చెప్పారు. 'మమ్మల్ని వెంటనే వెళ్లేలా చేయడానికి వారు మొదట చేతి పంపులను పగలగొట్టారు. పిల్లలు తమ ఇళ్లను కాపాడుకోవడానికి వారి పరీక్షలను కోల్పోవలసి వచ్చింది' అని అన్నారు. 14వ శతాబ్దపు తుగ్లకాబాద్ కోట చుట్టుపక్కల ప్రాంతం కూడా ఇటీవలి కూల్చివేత కార్యక్రమాన్ని చవిచూసింది. ఢిల్లీ యుద్ధ ప్రాంతంగా మారింది. తుగ్లకాబాద్‌కు వెళితే ఆ ప్రాంతం బాంబు పేల్చినట్లు అనిపిస్తుంది' అని సీపీఐ(ఎంఎల్) కార్యకర్త సుచేత దేశ్ అన్నారు. బస్తీ సురక్షకు చెందిన అబ్దుల్ షకీల్ మాట్లాడుతూ

- మిగతా 2 లో

రూ.2 వేల నోట్ల మార్పిడిలో

గందరగోళం

బ్యాంకుల్లో భిన్న పద్ధతులు - ప్రజల్లో అసంతృప్తి, అసహనం

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.2వేల నోట్ల మార్పిడి ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. 131 రోజుల్లోగా పెద్ద నోట్ల మార్పిడికి అవకాశం ఉంటుంది. అయితే మొదటి రోజుల అనేక బ్యాంకుల వద్ద గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రక్రియపై స్పష్టత లేక నోట్ల మార్పిడికి వచ్చిన ప్రజలు తలలు పట్టుకున్నారు. పాన్ లేక ఆధార్ వంటి గుర్తింపు కార్డుల అవసరం, డబ్బును ఖాతాల్లో జమ చేసుకోవాలని బ్యాంకులు కోరడం వంటివి గందరగోళానికి దారితీశాయి. ఎటువంటి ప్రతాల అవసరం లేకుండా నోట్లను మార్చుకోవచ్చని ప్రభుత్వం చెప్పినప్పటికీ గుర్తింపు కార్డులను బ్యాంకులు కోరడం ప్రజలకు విసుగు తెప్పించింది. చేతిలో ఉన్న రూ.2వేల నోట్లను తీసుకునేందుకు దుకాణాలు, బంకుల వాళ్లు అంగీకరించకపోవడం, వాటిని మార్చుకునేందుకు వెళితే అది కావాలి, ఇది కావాలని బ్యాంకులు ఇబ్బంది పెట్టడంతో దేశ రాజధానితో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు అసహనానికి గురయ్యారు. ఇదే క్రమంలో కొందరు బ్యాంకు సిబ్బందితో గొడవకు దిగారు. బ్యాంకుల వద్ద భారీ క్యూలైన్లు కనిపించాయి. వృద్ధులు ఇబ్బంది పడ్డారు. సెప్టెంబరు 30 వరకు గడువు ఉన్నప్పటికీ రోజువారీ లావాదేవీల్లో ఎదురవుతున్న ఇబ్బంది దృష్ట్యా రూ.2వేల నోట్లను మార్చుకునేందుకు ప్రజలు బ్యాంకులకు క్యూకట్టారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు లాజ్‌పత్ నగర్ శాఖలో సిబ్బందికి, నోట్ల మార్పిడికి వచ్చిన వారికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మండుటెండలో క్యూలో నిలుచోవడం, లోపలికి వెళ్లిన తర్వాత బ్యాంకులు ఇబ్బంది పత్రాలు/ఐడీ ప్రూఫ్‌లు వంటివి కోరడం, పెట్రోల్ బంకులు, వ్యాపారులు రూ.2నోట్లను అంగీకరించకపోవడం ప్రజలను అసహనానికి గురిచేస్తోంది. ఇటువంటి పరిస్థితికి బ్యాంకులు సంసిద్ధంగా ఉండాల్సిందని కొందరు అన్నారు.

కొన్ని బ్యాంకుల్లో ఎలక్ట్రానిక్ ఎంట్రీ ద్వారా నోట్ల మార్పిడి జరిగితే మరికొన్ని బ్యాంకులు తమ ఖాతాదారుల పేర్లు, ఫోన్ నంబర్లు తీసుకొని ప్రక్రియను పూర్తిచేశాయి. ఇంకొన్ని బ్యాంకుల్లో పాన్ లేక ఆధార్‌ను కోరగా మరికొన్ని బ్యాంకులు డబ్బును జమచేయాలని వినియోగదారులకు సూచించాయి. ఐడీ ప్రూఫ్ తప్పనిసరి కాదని యాక్సిస్, స్టాండర్డ్ చార్టెర్డ్, యస్‌బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ప్రైవేటు బ్యాంకులు పేర్కొనగా తమ బ్యాంకుల్లో ఖాతాలు లేని వారి ఐడీ ప్రూఫు లేక ఫారాన్ని హెచ్‌ఎస్‌బీసీ,

- మిగతా 2 లో

ఇదీ లోకం!



అసలు రెండువేల నోటు లేకుండా వచ్చే ఎన్నికలకు ఎలా వెళ్తాం? మన 'విశ్వగురు' ఐదువేల నోటు తెస్తాడని ఆశిద్దాం!

ప్రారంభోత్సవానికి దూరం

సీపీఐ, టీఎంసీ వెల్లడి　**నేడు ప్రతిపక్షాల ప్రకటన**

న్యూఢిల్లీ: పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరించే యోచనలో ప్రతిపక్షాలు ఉన్నాయి. ఈ నెల 28న పార్లమెంటు కొత్త భవనాన్ని ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. దీనిని ప్రతిపక్షాలు వ్యతరేకిస్తున్నాయి. రాష్ట్రపతి ముర్ము చేతులు మీదుగా ప్రారంభోత్సవం జరగాలని డిమాండ్ చేస్తున్నాయి. భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతికి అసలు ఆహ్వానమే పంపలేదనే వార్తలున్నాయి. ఈ పూర్వరంగంలో నూతన భవన ప్రారంభ కార్యక్రమాన్ని బహిష్కరించాలని భావిస్తున్నాయి. దీనిపై బుధవారం తుది నిర్ణయం, సంయుక్త ప్రకటనను వెలువరించనున్నట్లు కొన్ని పార్టీల వర్గాలు పేర్కొన్నాయి. అయితే తమ పార్టీ పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి హాజరు కాబోమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రకటించారు. భారతీయ ప్రజాస్వామ్యానికి మూలమైన పార్లమెంటును ప్రారంభించే అర్హత ప్రధానికి లేదన్నారు. టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ ట్విట్టర్‌లో స్పందిస్తూ 'మోదీకి మోదీ తప్ప మరేమీ పట్టదు. ఈ ప్రారంభోత్సవం కూడా

- మిగతా 2 లో

రాష్ట్ర ప్రగతికి చేయూత

- నీతి ఆయోగ్ సమావేశంలో కేంద్రాన్ని కోరనున్న సీఎం జగన్
- ప్రస్తావించాల్సిన అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వివిధ రంగాల్లో చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలతో అత్యుత్తమ ఫలితాలు సాధించాలంటే కేంద్రం చేయూత అవసరమని సీఎం జగన్ అన్నారు. ఈనెల 27న న్యూఢిల్లీలో జరగనున్న నీతిఆయోగ్ పాలకవర్గ సమావేశానికి సీఎం జగన్ హాజరవుతున్నారు. ఆ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ముఖ్యమంత్రి మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. వికాస్ భారత్ ఏ 2047, ఎంఎస్ఎంఈలు, మౌలిక సదుపాయాలు-పెట్టుబడులు, వ్యాపార వర్గాలకు సులభతర విధానాలు, మహిళాసాధికారత, ఆరోగ్యం, పౌష్టికాహారం, నైపుణ్యాభివృద్ధి, గతిశక్తి ఏరియా డెవలప్‌మెంట్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై నీతిఆయోగ్ పాలకమండలి చర్చించనుంది. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించడంతోపాటు కేంద్రం నుంచి సహాయాన్ని కోరాలని ఈ సమావేశం నిర్ణయించింది. కీలక రంగాలకు సంబంధించి కొన్ని సూచనలు చేయాలని సమావేశం తీర్మానించింది. ఆరోగ్యం, పౌష్టికాహారం రంగాల్లో ఏపీ ప్రభుత్వం తీసుకువచ్చిన చరిత్రాత్మక మార్పులను, ఫ్యామిలీ డాక్టర్, ఎస్‌సీడీఎస్‌ల నియంత్రణ, ఆరోగ్యశ్రీ, ఆస్పత్రుల్లో నాడు-నేడు,

- మిగతా 2 లో

వెనిజులా కమ్యూనిస్టులపై
మదురో ప్రభుత్వ కుతంత్రాలను తిప్పికొట్టాలి

24 కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు

కారకస్: వెనిజులా కమ్యూనిస్టు పార్టీపై నిషేధానికి మదురో ప్రభుత్వం చేస్తున్న కుతంత్రాలను తిప్పికొట్టాలని 24 కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు ముక్తకంఠంతో పిలుపునిచ్చాయి. వెనిజులాలోని కమ్యూనిస్టు పార్టీ (పీసీవీ)పై దాడులకు, నిషేధానికి మదురో ప్రభుత్వం కుతంత్రాలు చేస్తున్నట్లు ఆరోపించాయి. వెనిజులా కమ్యూనిస్టు పార్టీకి సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించాయి. మదురో ప్రభుత్వ కమ్యూనిస్టు వ్యతిరేక చర్యలను ఐక్యంగా ఖండించాయి. వెనిజులా గవర్నింగ్ పార్టీ (పీఎస్‌యూవీ) నాయకత్వం వెనిజులా కమ్యూనిస్టు పార్టీపై దాడులకు యత్నిస్తున్నదని పేర్కొన్నాయి. యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా (పీఎస్‌యూవీ) నాయకత్వం వెనిజులా కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తుండటాన్ని ప్రపంచ కమ్యూనిస్టులు ఖండిస్తున్నారని, రానున్న రోజుల్లో ఈ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంటుందన్న సంకేతాలు ఉన్నాయన్నారు. ప్రజల జీతాలు, కార్మికుల హక్కుల కోసం వెనిజులా కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు కొనసాగిస్తుంటే వెనిజులా ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను నేరపూరితమైనవిగా చిత్రీకరించే పనిలో ఉన్నదని 24కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల సంయుక్త ప్రకటన విమర్శించింది. కమ్యూనిస్టు పార్టీని అణచలేరని, ప్రజా వ్యతిరేక విధానాల సాధనంగా మార్చలేరని వెనిజులా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వెనిజులా కమ్యూనిస్టు పార్టీపై దాడులు, దానిని నేరపూరితమైనదిగా రుజువు చేసే యత్నాలను ముక్తకంఠంతో కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు ఖండించాయి. వెనిజులా కమ్యూనిస్టు పార్టీకి మిలిటెంట్ అనుభవం ఉన్నదని, శ్రామిక వర్గం, ప్రజలకు విడదీయరాని సంబంధాలున్నాయని తెలిపాయి. ప్రభుత్వ దురుద్దేశపూర్వక చర్యలకు తలొగ్గేది లేదని తేల్చిచెప్పాయి. అటు సామ్రాజ్యవాదం ఆంక్షలు,

దాడులు, ప్రజా వ్యతిరేక విధానాలకు బలవుతున్న వెనిజులా ప్రజలకు సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించాయి. వెనిజులా కమ్యూనిస్టు పార్టీకి మద్దతు తెలిపాయి. వెనిజులాలో కార్మికులు, ప్రజా ఉద్యమాలు, న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి పాటుపడే వెనిజులా కమ్యూనిస్ట్ పార్టీపై నిషేధం విధించేందుకు అంగీకరించబోమని తేల్చిచెప్పాయి. సంఘీభావం ప్రకటించిన పార్టీల్లో అల్బేనియా, బెల్జియం, బొహేమియా & మొరావియా, జర్మన్, గ్రీస్, ఇరాక్, కుర్దిస్తాన్-ఇరాక్, ఇజ్రాయిల్, లగ్జంబర్గ్, మాల్టా, మెక్సికో, నెథర్లాండ్స్, నార్వే, పాకిస్తాన్, పలస్తీనా, పరాగ్వా, సెర్బియా, స్వీడెన్, సిరియా, టర్కీ వెనిజులా, ఐర్లాండ్ కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు ఉన్నాయి. ఇదే తరహా చర్యలను ఖండిస్తూ ఫిబ్రవరిలోనూ సంయుక్త ప్రకటనను 30 కమ్యూనిస్టులు వెలువరించాయి.

విశాలాంధ్ర ప్రపంచం


PARLIAMENTARY ELECTIONS
May 2023

	MAY 2023 %	VOTES	SEATS	JULY 2019 %	VOTES	SEATS
KKE	7.23%	425,755	26	5.3%	299,518	15
New Democracy	40.79%	2,403,684	146	39.85%	2,251,087	158
SYRIZA	20.07%	1,182,408	71	31.53%	1,780,831	86
PASOK	11.46%	675,275	41	8.10%	457,468	22
Greek Solution	4.45%	262,506	16	3.70%	208,752	10
MeRA25	2.62%	159,040	0	3.44%	194,237	9

New Democracy (conservative party) · SYRIZA (social-democratic party) · PASOK (social-democratic party) · Greek Solution (nationalist Party) · MeRA25 (social-democratic party)

కేకేఈకి పెరిగిన ఎంపీలు

ఏథెన్స్: గ్రీస్‌లో ఈనెల 21న జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ)కి గణనీయంగా ఓట్లు పెరిగాయి. 2019 ఎన్నికలతో పోల్చితే 40శాతం ఎక్కువ ఓట్లు ఈసారి వచ్చాయి. పార్టీల ఎంపీల సంఖ్య దాదాపు రెట్టింపు అయింది. గతంలో 15 మంది ఎంపీలు ఉండగా ఇప్పుడు 26 మంది ఉన్నారు. తాజా ఎన్నికల్లో కేకేఈకి 7.23శాతం ఓట్లు రాగా న్యూ డెమక్రసీ (ఎన్‌డీ)కి 40.79శాతం, సిరిజాకు 20.07శాతం, పాసోక్‌కు 11.46శాతం, ఎల్లినికి లిసికి 4.45శాతం, నికికి 2.92శాతం ఓట్లు పోలయ్యాయి. తమ పార్టీకి ఓటు వేసిన కార్మికులు, శ్రామికులు, యువతకు కేకేఈ కేంద్ర కమిటీ తరపున సెల్యూట్ చేస్తున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌటోంబస్ ఒక ప్రకటన వెలువరించారు. ఎన్నికలకు తోడ్పాటు అందించి మంచిన కేకేఈ, కేఎన్ఈ కేడర్‌కు, వేలాది మంది సభ్యులకు అభినందనలు తెలిపారు. కమ్యూనిస్టులతో పాటు పోరాటాలు, ఉద్యమాలలో కలిసివచ్చిన వర్కర్లు, ప్రజల వల్లే నేడు ఈ ఫలితాలు వచ్చాయని వెల్లడించారు. పార్టీ బలోపేతానికి కృషిచేసిన అభ్యర్థులు అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్ట్రేలియాలో మేయర్‌గా ఎన్నికైన తొలి భారత సంతతి వ్యక్తి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో పర్రామట్టా నగర కౌన్సిల్‌కు నూతన మేయర్‌గా తొలిసారిగా భారత సంతతికి చెందిన సమీర్ పాండే ఎన్నికయ్యారు. అంతకుముందు 2017 నుంచి 2022 ఈ నగర డిప్యూటీ మేయర్‌గా సమీర్ పాండే బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మేయర్‌గా ఉను డోన డేవిస్ పార్లమెంట్‌కు ఎన్నికకావడంతో నూతన మేయర్‌గా సమీర్ పాండేను ఎన్నుకున్నారు. ఒక చిన్న ఐటీ సంస్థకు యజమాని అయిన సమీర్ పాండే వ్యక్తిగత ఆసక్తితో రాజకీయాల్లో చేరారు.

ఇమ్రాన్ ఖాన్‌కు 8 కేసుల్లో బెయిల్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు ఏటీసీ కోర్టు ఊరట కల్పించింది. జ్యుడిషియల్ కాంపెక్స్‌లో హింసకు సంబంధించిన ఎనిమిది కేసుల్లో జూన్ 8 వరకు బెయిల్ మంజూరు చేసింది. మార్చి 18న తోషాఖానా కేసు విచారణ కోసం కోర్టుకు పీటీఐ అధ్యక్షుడు హాజరయ్యే క్రమంలో ఆయన మద్దతుదారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. ఇమ్రాన్ ఖాన్ మంగళవారం ఏటీసీ కోర్టు విచారణకు హాజరయ్యేందుకు లాహోర్ నుంచి ఇస్లామాబాద్‌కు వెళ్లారు. రెండు పక్షాల వాదనలు విన్న ఏటీసీన్యాయస్థానం ఆయనకు జూన్ 8 వరకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మరోవైపు ఇమ్రాన్ ఖాన్ భార్య బుష్రా బీబీని అల్-ఖదీర్ ట్రస్ట్ కేసులో అరెస్టు చేయకుండా నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్ఏబీ)ని ఇస్లామాబాద్ కోర్టు నిలువరించింది. ఆమెకు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఇదే కేసులో ఇమ్రాన్ ఖాన్‌కు ఈనెల 31వ తేదీ వరకు బెయిల్ లభించిన సంగతి తెలిసిందే.

శరత్‌బాబుకు కన్నీటి వీడ్కోలు

చెన్నై: అనారోగ్యంతో సోమవారం తుది శ్వాస విడిచిన సీనియర్ సినీ నటుడు శరత్ బాబు అంత్యక్రియలు బంధువులు, సన్నిహితులు, అభిమానుల అశ్రునయనాల మధ్య ముగిశాయి. చెన్నైలో మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలను నిర్వహించారు. అంతకు ముందు చెన్నై టీనగర్ లోని తన నివాసంలో శరత్ బాబు భౌతికకాయాన్ని సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. రజనీకాంత్, సుహాసిని, శరత్ కుమార్, రాధిక తదితరులు ఆయన భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గిండి ఇండస్ట్రియల్ ఎస్టేట్ లోని శ్మశానవాటికకు తరలించి, అంతిమ కార్యక్రమాలను నిర్వహించారు. శరత్ బాబుకు సంతానం లేకపోవటంతో సోదరుడు తల కొరివి పెట్టారు. ఇక సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు శరత్ బాబు భౌతిక దేహాన్ని హైదరాబాద్‌లోని ఫిలిం చాంబర్‌లో ఉంచిన సంగతి విదితమే. నటుడు శరత్ బాబు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నారు. హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉన్నారు. ఈ నేపథ్యంలోనే మే 22, సోమవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. మల్టీపుల్ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ కారణంగా ఆయన మరణించారు. శరత్ బాబు మరణంపై తెలుగు, కన్నడ, తమిళ చిత్ర పరిశ్రమల ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

శరత్‌బాబు ఎంతో మంచి మనిషి: రజనీకాంత్

శరత్‌బాబు భౌతిక కాయాన్ని చివరిసారిగా చూసిన సూపర్‌స్టార్ రజనీకాంత్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మాట్లాడుతూ.. 'ఇండస్ట్రీ ఓ మంచి స్టార్ ని కోల్పోయింది... శరత్ బాబు ఎంతో మంచి మనిషి... ఆయనలో ఎప్పుడూ నేను కోపాన్ని చూడలేదు... నా పట్ల ఎంతో అప్యాయతతో ఉండేవారు... మేం ఇద్దరం మంచి స్నేహితులుగా ఉండేవాళ్లం... ముత్తు, అన్నామలై, వేలైక్కారన్ ఇలా వివిధ చిత్రాల్లో కలిసి నటించాం...అవి సూపర్ హిట్ గా నిలిచాయి...శరత్ బాబు ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకునేవారు...నాకు సిగరెట్లు బాగా కాల్చే అలవాటు... నేను ఎప్పుడు సిగరెట్ తాగుతున్నా నోట్లో నుంచి లాగి అవతల పడేసేవాడు...ఎక్కువ సిగరెట్స్ కాల్చితే ఆరోగ్యానికి ప్రమాదం అని సున్నితంగా హెచ్చరించేవాడు... నేను ఎప్పుడైనా టెన్షన్ కి లోనై సరిగా నటించకుంటే పక్కన కూర్చొని భుజం తట్టి నన్ను ప్రోత్సహించేవాడు...మా మధ్య ఎన్నో ఏళ్లుగా స్నేహబంధం కొనసాగుతూ వస్తోంది.ఆయన మృతి తట్టుకోలేకపోతున్నా' అంటూ కంట తడి పెట్టారు.

రేపు టీఎస్ ఎంసెట్ ఫలితాలు

హైదరాబాద్: టీఎస్ ఎంసెట్ 2023 ఫలితాలు ఈ నెల 25వ తేదీన విడుదల చేయనున్నట్లు ఎంసెట్ కన్వీనర్ మంగళవారం ప్రకటించారు. 25వ తేదీన ఉదయం 11 గంటలకు కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూ క్యాంపస్‌లోని గోల్డెన్ జూబ్లీ సెమినార్ హాల్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫలితాలను విడుదల చేస్తారని తెలిపారు. ఎంసెట్ అగ్రికల్చర్, మెడికల్, ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించిన ఫలితాల ర్యాంకులను, మార్కులను విడుదల చేయనున్నారు. ఎంసెట్ హాల్ టికెట్ నంబర్ ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చు. ఇక మెడికల్, అగ్రికల్చర్, ఇంజినీరింగ్ టాప్ టెన్ ర్యాంకర్ల వివరాలను కూడా వెల్లడించనున్నారు. ఎంసెట్ ఫలితాలను eamcet.tsche.ac.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

ప్రారంభోత్సవానికి దూరం

(మొదటిపేజీ తరువాయి)

అందుకే పరిమితమవుతుంది. భారతీయ ప్రజాస్వామ్యానికి పార్లమెంటు మూలస్తంభం. ఇది కేవలం భవనం కాదు. పాత ఆచరాలు, సంప్రదాయాలు, వారసత్వాలు, నిబంధనలకు నిలయం' అని వ్యాఖ్యానించారు. ప్రారంభోత్సవానికి రావడం లేదని టీఎంసీ నేత తెలిపారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్ స్పందిస్తూ 'సాదాసీదా నేపథ్యంగల మహిళా రాష్ట్రపతి ముర్మును అగౌరవపరుస్తున్నారు ఎందుకు? ఆమె రాష్ట్రంలో ఎన్నికలు జరగడం లేనందున? పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలి. అలా ఎందుకు జరగనివ్వడంలేదు? మీ పేరు రాతిపై చెక్కి ఉండాలనేగా ఇదంతా?' అని గౌరవ్ నిలదీశారు. కార్యక్రమాన్ని బహిష్కరించాలా లేదా అన్నది తమ పార్టీ సరైన సమయంలో నిర్ణయిస్తుందని చెప్పారు. 2020 డిసెంబరులో పార్లమెంటు నూతన భవనానికి మోదీ శంకుస్థాపన చేసినప్పుడు కూడా ఆ కార్యక్రమాన్ని విపక్షాలు బహిష్కరించాయి. కరోనా, ఆర్థిక మందగమనం, రైతుల నిరసనలు నడుమ శంకుస్థాపన చేయడాన్ని తీవ్రంగా విమర్శించాయి. కాగా, పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవానికి ఎంపీలకు ఇప్పటికే ఆహ్వానాలు అందాయి. 28వ తేదీ ఉదయం 11.30 గంటలకు అందరూ తమ స్థానాల్లో ఆశీనులు కావాలని, కార్యక్రమం మధ్యాహ్నం ప్రారంభమవుతుందని ఆహ్వానపత్రిక పేర్కొంది.

దగ్గు మందు ఎగుమతులపై
1 నుంచి కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: భారత్‌లోని కొన్ని కంపెనీల దగ్గు మందుల వల్ల కొన్ని దేశాల్లో మరణాలు సంభవిస్తుండటాన్ని కేంద్రప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దగ్గుమందు ఎగుమతులపై కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ప్రభుత్వ ప్రయోగశాలల అనుమతిని తప్పనిసరి చేసింది. జూన్ 1 నుంచి కొత్త నిబంధనలు అమలవుతాయని ప్రకటించింది. దగ్గు సిరప్‌లకు ప్రభుత్వ ల్యాబ్‌లలో అనుమతి పొందిన తర్వాత ఎగుమతి చేయాలని కేంద్రప్రభుత్వం స్పష్టంచేసింది. భారత్ నుంచి ఎగమతయ్యే వివిధ రకాల ఔషధ ఉత్పత్తుల నాణ్యతపై రాజీ పడేది లేదని, అందుకే ఎగుమతికి ముందే దగ్గు మందుల నాణ్యతను పరిశీలించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 'దగ్గు మందు ఎగుమతిదారులు తమ ఉత్పత్తులను ఏదైనా ప్రభుత్వ లాబ్‌లో పరీక్షించి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి.
ఆ పత్రాన్ని సమర్పిస్తేనే తమ దగ్గు మందులను ఎగుమతి చేసేందుకు కంపెనీలకు అనుమతి లభిస్తుంది' అని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నోటిఫికేషన్‌లో వెల్లడించింది.
కేంద్రప్రభుత్వ పరిధిలోని ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్, రీజినల్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ (ఆర్‌డీటీఎల్-చండీగఢ్), సెంట్రల్ డ్రగ్స్ ల్యాబ్ (సీడీఎల్-కోల్‌కతా), సెంట్రల్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ , ఆర్డీటీఎల్ (గువాహటి)తో పాటు రాష్ట్రప్రభుత్వ గుర్తింపు పొందిన ల్యాబ్‌లలో దగ్గు మందులకు పరీక్షలు చేయించుకోవాలని ఎగుమతిదారులకు కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది.గాంబియా, ఇండోనేషియా, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాల్లో భారత్‌లో తయారైన దగ్గు మందు తీసుకోవడం వల్ల చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) కూడా ఆందోళన వ్యక్తం చేసింది.

మళ్లీ రూ.2 వేల కోట్ల అప్పు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. అయినప్పటికీ మంగళవారం అప్పు చేసే ప్రక్రియను మాత్రం ప్రభుత్వం కొనసాగిస్తోంది. మూడు వారాల నుంచి వరుసగా ప్రతి మంగళవారం రిజర్వు బ్యాంకులో సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రుణాన్ని సేకరిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్ఆర్‌బీఎం కింద ఏపీకి 30,500 కోట్ల రూపాయలు మాత్రమే రుణ పరిమితి ఉంది. ఈ ఏడాది డిసెంబరు నెల వరకు మొత్తం 9 నెలల్లో చేయాల్సిన అప్పు 50 రోజుల్లోనే రూ.13,500 కోట్లకు చేరింది. అంటే దాదాపు సగభాగం రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వాడేసుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీని రూ.14,40,400 కోట్లుగా అంచనా వేస్తున్నారు. అందులో 3.5 శాతాన్ని నికర రుణపరిమితిని లెక్కించి... దానికి ఈ ఏడాదిలో తిరిగి చెల్లించే రుణాల మొత్తాన్ని కలిపి ఎంత అప్పులు చేయవచ్చో తేలుస్తారు. వాటికి ప్రజారుణం, కేంద్ర రుణాలు, ఇతర రుణాలు మినహాయిస్తారు. దీనిప్రకారం స్థూల ఉత్పత్తిలో 3.5 శాతానికి మించకుండా రాష్ట్ర అప్పు ఉండాలి. దీనిపై కేంద్ర ఆర్థికశాఖలోని వ్యయ నియంత్రణ విభాగం ఒక రాష్ట్రానికి ఉన్న అప్పులన్నీ పరిగణనలోకి తీసుకుని, వాటన్నింటినీ మినహాయించి మిగిలిన మొత్తాలకు మాత్రమే రిజర్వు బ్యాంకు నుంచి బహిరంగ మార్కెట్ రుణం తీసుకునేలా అనుమతులిస్తుంది. ఏపీలో మాత్రం వీటికి పూర్తి భిన్నంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి అంచనాలను పెంచి చూపడం నుంచి ఇతరత్రా అనేక ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయి.

వైసీపీని చూసి సీబీఐ వణుకుతోంది

ఎంపీ అవినాశ్ రెడ్డి వ్యవహారంపై గవర్నర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : దేశంలో ఎక్కడాలేని పరిస్థితులను ఆంధ్రప్రదేశ్‌లో చూస్తున్నామని, వైసీపీనిచూసి సీబీఐ భయపడటం ఆశ్చర్యకరంగా ఉందని, ఎంపీ అవినాశ్‌రెడ్డి అరెస్ట్ విషయంలో జరుగుతున్న తంతుపై టీడీపీ నేతలు మంగళవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గవర్నర్ ను కలిసినవారిలో టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, వర్లరామయ్య, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, శాసనసభ్యులు గద్దె రామ్మోహనరావు తదితరులున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. "జగన్మోహన్ రెడ్డి చిన్నాన్న వివేకానందరెడ్డి హత్యకేసు ఎన్నో మలుపులు తిరుగుతోంది.

సీబీఐ విచారణలో విస్తుగొలిపే వాస్తవాలు బయటకు వస్తున్నాయి. వివేకానందరెడ్డిహత్య జరిగినప్పుడు అవినాశ్ రెడ్డి సాక్ష్యాలు లేకుండా చేయడానికి ప్రయత్నించాడని, ఆయనే కీలకముద్దాయని సీబీఐ తేల్చిందన్నారు. తన బాగోతం బయటపడిన వెంటనే, అవినాశ్ రెడ్డి ముందస్తుబెయిల్ కోసం హైకోర్టుని, సుప్రీంకోర్టుని ఆశ్రయించాడు. వందలకోట్లు ఇప్పటివరకు ఖర్చుపెట్టాడు. ఆ డబ్బంతా అవినాశ్ రెడ్డికి ఎక్కడినుంచి వచ్చింది. విచారణకు రావాలని సీబీఐ ఇప్పటికి మూడుసార్లు నోటీసులిస్తే వెళ్లకుండా, తల్లిని అడ్డుపెట్టుకొని కొత్తనాటకానికి తెరలేపాడు. ఇదంతా తాడేపల్లి ప్యాలెస్ ఆడిస్తున్న డ్రామానే. తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాల ప్రకారమే రాష్ట్ర పోలీస్ వ్యవస్థ హత్యకేసులో ముద్దాయిని కాపాడటానికి ప్రయత్నిస్తోందన్నారు. దేశంలో సీబీఐ ఎక్కడికివెళ్లినా తప్పుచేసినవారు భయపడతారు.

కానీ ఏపీ ప్రభుత్వానికి సీబీఐ భయపడుతోందన్నారు. సీబీఐ అధికారులు కర్నూలులో 8గంటపాటుఎస్పీ ఆఫీసులో కూర్చుంటే, వారికి ఎందుకు భద్రత కల్పించలేకపోయారు? అవినాశ్ రెడ్డి మనుషులు, వైసీపీ గూండాలు మీడియాపై దాడిచేస్తున్నా, సీబీఐ వారిని అడ్డుకుంటున్నా, పోలీసులు ఎందుకు నిరోధించలేకపోయారు? అని ప్రశ్నించారు."పశ్చిమబెంగాల్లో మంత్రిని అరెస్ట్ చేసినప్పుడు సీబీఐ బాగానే పనిచేసింది. ఢిల్లీలో ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను కార్లోవెళ్లి వెంటనే లాక్కొచ్చారు.

గతంలో కేంద్రమంత్రిగా ఉన్న రాజాను నలుగురు అధికారులు వెళ్లి లాక్కొచ్చారు. ఇంతచేసిన సీబీఐ ఏపీలో వివేకా హత్యకేసులో ముద్దాయిగాఉన్న అవినాశ్ రెడ్డిని అరెస్ట్ చేయడానికి ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నది? రాష్ట్రంలో జరుగుతున్న ఈ పరిణామాలన్నింటినీ ఆధారాలతో సహా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని, మేంచెప్పిన వాటిపై ఆయన ఆశ్చర్యపోయారని వారు వివరించారు.

రాష్ట్ర ప్రగతికి చేయూత

(మొదటిపేజీ తరువాయి)

తల్లులు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, ఆస్పత్రుల్లో సరిపడా సిబ్బంది నియామకం, 104 వాహనాల ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌ల అనుసంధానం ద్వారా కార్యక్రమం ఎలా విజయవంతంగా సాగుతుందో వివరించాలని నిర్ణయించారు. మహిళా సాధికారత కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించనున్నారు.

బహుళజాతి కంపెనీలతో కలిసి చేసిన చేయూత ద్వారా ఆయా కుటుంబాల్లో జీవన ప్రమాణాలు పెరిగేందుకు ఏ రకంగా పథకం ఉపయోగపడిందో, ఆర్థికంగా వారు నిలదొక్కుకునేందుకు ఎలా తోడ్పాటు అందించిందో, ఆసరా, సున్నా వడ్డీ రుణాల పాత్రను తెలియజేయనున్నారు. దిశ కింద చేపట్టిన కార్యక్రమాలను, దాదాపు 30 వేలకుపైగా ఇంటర్‌వెన్షన్స్ జరిగిన విషయాన్ని ప్రస్తావించనున్నారు. ఎంఎస్‌ఎంఈలకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహాయాన్ని తెలుపుతూ, దీనికి కేంద్రం మద్దతు కోరనున్నారు. మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల రంగాలకు సంబంధించి రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల్లో కొనసాగుతున్న పనులను, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లతోనూ తీర ప్రాంతంలో గణనీయంగా పెరగనున్న మౌలిక సదుపాయాల అంశాలను ప్రస్తావించనున్నారు. కడప, కర్నూలు విమానాశ్రయాలకు నిధులు పూర్తిస్థాయిలో వెచ్చించి వాటిని సంపూర్ణ వినియోగంలోకి తీసుకొచ్చిన అంశాన్ని, కొత్తగా నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం, నెల్లూరు సమీపంలోని తెట్టు వద్ద విమానాశ్రయం నిర్మాణం అంశాలను కేంద్రం దృష్టికి తీసుకురానున్నారు.

సమావేశంలో సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మీ, వ్యవసాయ, సహకార శాఖల స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె.శ్యామలరావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్ కుమార్, ఐటీశాఖ కార్యదర్శి కోన శశిధర్, వైద్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ జె.నివాస్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ వినోద్ కుమార్, సీసీఎల్ఏ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెరిసిన తెలుగు తేజాలు

(మొదటిపేజీ తరువాయి)

మంది సివిల్స్‌కు అర్హత సాధించారు. టాప్ 25 అభ్యర్థుల్లో 14 మంది మహిళలు, 11 మంది పురుషులు ఉన్నారు. మొత్తం అభ్యర్థుల్లో జనరల్ కోటాలో 345 మంది, ఈడబ్ల్యూఎస్- 99, ఓబీసీ - 263, ఎస్సీ -154, ఎస్టీ - 72 మంది చొప్పున ఉన్నారు. 178 మంది రిజర్వ్ జాబితాలో ఉన్నారు. 1,022 ఖాళీలలో ఐఏఎస్ పోస్టులకు 180, ఐఎఫ్ఎస్‌కు 38, ఐపీఎస్‌కు 200 చొప్పున ఎంపికయ్యారు. సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్-ఎ విభాగంలో 473 మంది, గ్రూప్ బీలో 131 మంది ఎంపికైనట్లు యూపీఎస్సీ ప్రకటించింది. మరో 15 రోజుల్లో వెబ్‌సైట్‌లో మార్కులు అందుబాటులో ఉంచుతామని వెల్లడించింది. గతేడాది జూన్ 5న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు జరిగాయి. మొత్తం 11,35,697 మంది దరఖాస్తు చేసుకోగా 5,73,735 మంది పరీక్షలకు హాజరయ్యారు. 2022, సెప్టెంబరులో నిర్వహించిన మెయిన్స్‌కు 13,090 ఎంపికయ్యారు. పర్సనాలిటీ టెస్ట్‌కు 2,539 మంది అర్హతసాధించారు.

నా కల నెరవేరింది: ఇషితా కిశోర్

'నా కల నెరవేరింది. నా శ్రమ ఫలించింది. ఇక నేను ఐఏఎస్ కాగలను. మహిళా సాధికారత కోసం పనిచేయగలను' అని టాపర్ ఇషితా కిశోర్ (26) అన్నారు. మొదటి ర్యాంకు సాధించడంపై అమితానందాన్ని వ్యక్తంచేశారు. మొదటి రెండు ప్రయత్నాలు విఫలం కాగా మూడోసారి టాపర్‌గా నిలవగలిగానని, దీని వెనుక తన కుటుంబ ప్రోత్సాహం ఎంతో ఉన్నదని ఆమె చెప్పారు. పట్టుదలతో రోజుకు 8-9 గంటలు చదివినట్లు వైమానిక దళాధికారి తనయ, ఢిల్లీ విశ్వవిద్యాలయం గ్రాడ్యుయేట్ అయిన ఇషితా కిశోర్ చెప్పారు. యూపీ కేడర్ ఐఏఎస్ అధికారి కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారిణినని, సుబ్రతో కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ -2012లో ఆడానని కూడా ఆమె తెలిపారు.

తెలుగు తేజాలు:

తెలుగు తేజం ఉమా హారతి తెలంగాణలోని నారాయణపేట జిల్లా ఎస్పీ కుమార్తె. ఆలిండియా మూడో ర్యాంకు సాధించారు. ఆంధ్రప్రదేశ్, తిరుపతికి చెందిన జీవీఎస్ పవన్ దత్తా 22 ర్యాంకు సాధించగా, శాఖమూరి శ్రీసాయి హర్షిత్ 40, సాయి ప్రణవ్ 60, ఆవుల సాయికృష్ణ 94, నిధి పాయ్ (హైదరాబాద్) 110, అనుగు శివమారుతీరెడ్డి 132, రాళ్లపల్లి వసంత్ కుమార్ 157, కమతం మహేశ్‌కుమార్ 200, రావుల జయసింహారెడ్డి 217, విశాఖకు చెందిన సాహిత్య 243, అంకుర్ కుమార్ 257, బొల్లం ఉమామహేశ్వర్‌రెడ్డి 270, చల్లా కల్యాణి 285, పాలువాయి విష్ణువర్ధన్‌రెడ్డి 292, గ్రంథె సాయికృష్ణ 293, వీరగంధం లక్ష్మి సుజిత 311, ఎన్.చేతనా రెడ్డి 346, శృతి యారగట్టి ఎస్ 362, సోనియా కటారియా 376, యప్పలపల్లి సుష్మిత 384, రేవయ్య 410, సీహెచ్ శ్రావణ్‌కుమార్ రెడ్డి 426, బొల్లిపల్లి వినూత్న 462, రెడ్డి భార్గవ్ 772, నాగుల కృపాకర్ 866 ర్యాంకులతో సత్తా చాటారు.

ర్యాంకు సాధించిన వంటమనిషి కొడుకు

ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన డోంగ్రి రేవయ్య సివిల్స్‌లో 410వ ర్యాంకు సాధించారు. రేవయ్య తల్లి ప్రభుత్వ పాఠశాలలో వంటమనిషి. భర్త అనారోగ్యంతో చనిపోతే వంట పని చేసి తన కుమారుడిని ఉన్నత చదువులు చదివించుకున్నది. రేవయ్య అంకితభావంతో చదివి సివిల్స్ ర్యాంకు సాధించారు.

మితిమీరిన కూల్చివేతల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

తుగ్లకాబాద్ తొలగింపు 'క్రూరమైనది. ఇంత పరిమాణంలో ఎన్నడూ చూడలేదు' అని అన్నారు. 'కూల్చివేత రోజున పోలీసులు బస్తీని చుట్టుముట్టారు. ఎవరూ వీడియోలను పంచుకోకుండా జామర్లు అమర్చారు. కార్యకర్తల ఫోన్లు లాక్కున్నారు. సమీపంలోని హోటళ్లు, దుకాణాలను మూసివేశారు. రెండు రోజుల్లో మొత్తం బస్తీని ధ్వంసం చేశారు' అని షకీల్ వివరించారు. సిమ్లా మాజీ డిప్యూటీ మేయర్ టికేందర్ సింగ్ పన్వార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో గృహనిర్మాణాన్ని ప్రాథమిక హక్కుగా చేర్చాలని అన్నారు. 'మీరు నగరాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. పేదలను నేరస్తులుగా చేస్తున్నారు. గృహాన్ని ప్రాథమిక హక్కుగా పొందడం ముఖ్యం. శ్రామిక వర్గాన్ని వదిలిపెట్టి సాంకేతిక కేంద్రీకృత, మూలధన అవసర పరిజ్ఞానంతో నగరాలు నిర్మించబడుతున్నాయి. పేదలకు స్థలం లేదు' అని ప్రజా బహిరంగ విచారణలో పన్వార్ అన్నారు. న్యాయవాది, కార్యకర్త ఆనంద్ యాగ్నిక్ మాట్లాడుతూ తొలగింపులను 'రాజ్యాంగ విరుద్ధం' అని అన్నారు. 'జి20 కార్యక్రమం చట్టబద్ధమైన నియమానికి కట్టుబడి లేని రాజ్యాంగ వ్యతిరేక సంఘటనగా మారినట్లు కనిపిస్తోంది. హైకోర్టు లేదా సుప్రీం కోర్టు ఆదేశాలను జి20 తోసిపుచ్చిన కారణంగా రాజ్యాంగాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం ఊహించలేము' అని యాగ్నిక్ అన్నారు. మానవ హక్కుల కార్యకర్త, ఐఏఎస్ మాజీ అధికారి హర్ష్ మందర్ మాట్లాడుతూ నగరంలోని పేదలను బహిష్కరించడం ద్వారా ప్రపంచం నలుమూలల నుంచి ప్రతినిధులను స్వాగతించడం అందం లేదా అభివృద్ధికి వక్రీకరించిన అర్థాన్ని చిత్రీకరిస్తుందని తెలిపారు. ఈ విచారణలో జ్యూరీ సభ్యురాలు పమేలా ఫిలిపోస్ మాట్లాడుతూ ఈ కూల్చివేతల్లో బుల్‌డోజర్‌లను తీవ్రంగా ఉపయోగించడం 'ప్రభుత్వ క్రూరత్వానికి చిహ్నం' అని అన్నారు. 'హాకర్లను ఆక్రమణదారులుగా, బస్తీవాసులను అక్రమ నివాసితులుగా, నిరాశ్రయులను మాదకద్రవ్యాలకు బానిసలుగా ఎలా పరిగణిస్తారో వినడం బాధాకరం' అని ఆమె తెలిపారు. జాతీయ రాజధాని ఇటీవలి సంవత్సరాలలో అనేక ఆక్రమణల వ్యతిరేక కార్యక్రమాలను చూసింది. 2021లో హౌసింగ్ అండ్ ల్యాండ్ రైట్స్ నెట్‌వర్క్ (హెచ్ఎల్ఆర్ఎన్) నివేదిక ప్రకారం, కేంద్ర, రాష్ట్ర స్థాయిలలోని ప్రభుత్వ అధికారులు 36,480 గృహాలను కూల్చివేశారు. తద్వారా పట్టణ, గ్రామీణ భారతదేశంలోని 2,07,100 (2.07 లక్షల) మంది ప్రజలను వారి ఇళ్ల నుంచి తొలగించారు. దేశవ్యాప్తంగా అధికారులు జనవరి నుంచి జులై 2022 వరకు 25,800 ఇళ్లను కూల్చివేశారు. కనీసం 124,450 మందిపై ప్రభావం చూపిందని నివేదిక పేర్కొంది.

గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

కోటక్ మహీంద్ర బ్యాంకులు కోరాయి. పత్రాలు అక్కర్లేదని ఐడీ ఉంటే చాలని బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు తమ కస్టమర్ల నుంచి ఫారాలు తీసుకున్నాయి. అయితే చాలా బ్యాంకుల వద్ద పెద్దగా రద్దీ కనిపించలేదు.

రూ.2వేల నోట్లు ఆకస్మికంగా వినియోగంలోకి రావడంతో వ్యాపారులు కంగారు పడుతున్నారు. ఇప్పటివరకు చెలామణిలో పెద్దగా లేని ఆ నోట్లను తీసుకునేందుకు వారు నిరాకరిస్తున్నారు. ఏటీఎంలలో రూ.2వేల నోట్లు వస్తున్నాయని, దుకాణదారులు, పెట్రోల్ బంకుల వారు వాటిని తీసుకోవడం లేదని చాలా మంది వాపోయారు. తమ నోట్లను మార్చేందుకు బ్యాంకులు నిరాకరించడం, వాటిని జమ చేసుకోవాలని సూచించడం కొందరికి కోసం తెప్పించింది.

తాజా పరిణామంతో తాము మోసపోయామన్న భావన కలుగుతోందని వారన్నారు. అయితే రూ.2,000 నోట్లను ఎలాంటి లావాదేవీకైనా వినియోగించుకోవచ్చని భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వెల్లడించింది. సెప్టెంబరు 30లోగా నోట్లను మార్చుకోవాలని, ఒకసారికి 10 నోట్లను మాత్రమే మార్చుకోవాలనే నిబంధన పెట్టింది.దీంతో తక్కువ నోట్లు ఉంటే మార్చుకోవడమే ఉత్తమమని నిపుణులు సూచించారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

- ఏపీజేఏసీ అమరావతి నేతలు బొప్పరాజు, పలిశెట్టి స్పష్టీకరణ
- 27న ఏలూరు ప్రాంతీయ సదస్సు జయప్రదానికి పిలుపు

విశాలాంధ్ర- ఏలూరు: ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు తాము చేపట్టిన ఉద్యమం ఆగదని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు స్పష్టం చేశారు. ఏపీ జేఏసీ అమరావతి ఏలూరు జిల్లా సభ్య సంఘాల అధ్యక్ష, పెన్షనర్లు, కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగ సంఘాల అధ్యక్ష కార్యదర్శులతో స్థానిక రెవిన్యూ భవనంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ, ఈ నెల 27న ఏలూరులో జరగనున్న ప్రాంతీయ సదస్సు (పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణ జిల్లా ఏలూరు జిల్లా) జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఏలూరులోని టొబాకో మర్చంట్ కళ్యాణ మండపంలో ఈ ప్రాంతీయ సదస్సు నిర్వహించ నున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు ఉద్యోగుల సమస్యలుపై నిజాయితిగా ఉద్యోగుల పక్షాన గత 73 రోజులుగా ఏపీజేఏసి అమరావతి ఆధ్వర్యంలో చేస్తున్న ఉద్యమ ఫలితంగా ప్రభుత్వం స్పందించి కొన్ని సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ ఉద్యమం మొదలు పెట్టినప్పటి నుండి చెప్తున్నట్లుగా ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇచ్చిన 50 పేజీల మెమోరాండంలో పొందుపరచిన వాటిలో కొన్ని అంశాలపట్ల సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగుల సర్వీస్ రూల్స్ సమస్యలు, వర్క్ చార్జ్ ఉద్యోగుల పేరు ఇంజినీర్ సబార్డినేట్ గా మార్చి 010 పద్దు కింద జీతాలు, డీఆర్డీఏ ఉద్యోగులను పీఆర్, ఆర్ డి శాఖలో విలీనం చేయడం, మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం, గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని ఇంజినీర్లకు డీఈ పోస్టులు మంజూరు తదితర ముఖ్యాంశాల అన్నింటిపైనా స్పష్టమైన లిఖితపూర్వక ఉత్తర్వులు వస్తేనే తప్ప ఈ ఉద్యమం ఆగేది లేదని బొప్పరాజు, పలిశెట్టి స్పష్టంచేశారు. గత 4 సంవత్సరాలుగా ఈ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించినప్పటికీ, ఉద్యోగులను పూర్తిగా విస్మరించినందున, తప్పని పరిస్థితుల్లో గత 73 రోజులుగా ఉద్యమం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ మోహన్, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అధ్యక్షులు మల్లేశ్వర రావు, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యదర్శి బి.జ్యోతి, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వేంకటేశ్వర రావు, నాయకులు కృష్ణమాచార్యులు, సిఐటియు ఉపాధ్యక్షులు సోమయ్య వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి దుర్మార్గం: రామకృష్ణ



విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కర్నూలులో పాత్రికేయులపై దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలులోని విశ్వభారతి హాస్పిటల్ వద్ద మీడియా ప్రతినిధులపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. కెమెరాలు లాక్కొని ధ్వంసం చేయడం, ఆస్పత్రి వద్దకు వస్తే చంపేస్తామని కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరులు బెదిరింపులకు దిగడాన్ని ఆయన గర్హించారు. జర్నలిస్టులపై దాడులు సరికాదని, ఇవి ప్రజాస్వామ్యానికి ప్రమాదమని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీబీఐ అధికారులు ఆసుపత్రి వద్దకు వస్తున్నారన్న సమాచారం తెలిసి వార్తల సేకరణ కోసం వెళ్లిన మీడియా ప్రతినిధులపై విచక్షణారహితంగా దాడి చేసి కొట్టడం దారుణమని రామకృష్ణ విమర్శించారు. దాడి జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు అమర్చి ఉంటారని, వాటి ఆధారంగా నిందితులను గుర్తించి కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తన అనుచరులను, కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలని అవినాశ్‌రెడ్డికి సూచించారు. స్వేచ్ఛగా వార్తల సేకరణకు అవరోధాలు తొలగించాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

తక్షణమే కూలి రేట్లపై ఒప్పందం

ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్ల భేటీలో వెంకటసుబ్బయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆర్టీసీ లైసెన్స్ కూలీలకు సంబంధించిన కూలీ రేట్ల పెంపుదలపై తక్షణం ఒప్పందం చేయాలని, దాని ప్రకారం కూలి చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. విజయవాడ గొల్లపూడిలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్ల రాష్ట్ర సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఆర్టీసీ కూలీలకు కూలి రేట్ల ఒప్పందం ముగిసి మూడు నెలలు గడుస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం అన్యాయమని దుయ్యబట్టారు. పోర్టర్లకు చట్టప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ, బీమా, యూనిఫామ్, ఐడీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్ల యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల రమణ మాట్లాడుతూ కార్మికులు ఐక్య పోరాటాలు సాగిస్తే ఎంత మొండి ప్రభుత్వమైనా తలవంచక తప్పదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పట్టించుకునే స్థితిలో లేదని విమర్శించారు. ఎన్నిసార్లు మొత్తుకున్నా పట్టించుకోవడం లేదని, బలమైన పోరాటాలు సాగించాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ కార్గో సంస్థలు లైసెన్స్ కూలీల రెక్కల కష్టంపై బతుకుతున్నాయని, కార్మికుల శ్రమ వల్లే ఆర్టీసీకి లాభాలు వస్తున్నాయని చెప్పారు. అలాంటి కార్మికులకు న్యాయం చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో నిత్యం ధరలు పెరుగుతున్నాయని, ప్రభుత్వం కూడా పన్నుల మీద పన్నులు వేస్తూ బాదుడు కార్యక్రమం సాగిస్తున్నదన్నారు. విద్య, వైద్య ఖర్చులు, అద్దెలు, కరెంటు బిల్లులు, నీటి పన్ను, ఇంటి పన్ను, చెత్త పన్ను పేరుతో ప్రభుత్వం తమ ఆదాయాన్ని లాగేసుకుంటున్నదని చెప్పారు. తమ డిమాండ్‌ను పరిష్కరించాలని కోరి మూడు మాసాలైందని గుర్తుచేశారు. 14 రోజుల్లోపు తమ సమస్యను పరిష్కరించకపోతే జూన్ ఆరో తేదీ నుండి ఏ క్షణమైనా విధులు నిలిపివేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.ఆనంద్, రాష్ట్ర కోశాధికారి వేముల వాసు, కార్మిక నాయకులు గుంజ వాసు, డి.శ్రీనివాసరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-గుంటూరు: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం తృతీయ రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలు మంగళవారం గుంటూరు అన్నమయ్య గ్రంథాలయంలో జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా సోమేపల్లి వెంకటసుబ్బయ్య(గుంటూరు జిల్లా), ప్రధాన కార్యదర్శిగా చలపాక ప్రకాశ్(ఎన్టీఆర్ జిల్లా), కోశాధికారిగా నానా(నారిశెట్టి సత్యనారాయణ-గుంటూరు జిల్లా)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి(గుంటూరు), పొన్నూరి వెంకట శ్రీనివాసులు (ప్రకాశం జిల్లా), పి.హరికృష్ణారెడ్డి(చిత్తూరు), ఎ.జయప్రకాశ్(నెల్లూరు జిల్లా), ఎస్ఆర్ పృథ్వీ(తూర్పు గోదావరి జిల్లా), రాధేయ(అనంతపురం), మాధవీ సనారా (అనకాపల్లి జిల్లా), బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి(గుంటూరు), కార్యదర్శులుగా ఎస్ఎం సుభానీ(గుంటూరు జిల్లా), కేజీ రమేశ్(పల్నాడు జిల్లా), సీఎస్ చంద్రశేఖర్(చిత్తూరు), బుర్రి కుమార్ రాజా(శ్రీకాకుళం), పి.లక్ష్మణరావు (విజయనగరం), శర్మ సీహెచ్(ఎన్టీఆర్ జిల్లా), కార్యవర్గ సభ్యులుగా కోపూరి పుష్పాదేవి(ఎన్టీఆర్ జిల్లా), ఎమ్ఆర్‌వీ సత్యనారాయణమూర్తి(పశ్చిమగోదావరి జిల్లా), ఎస్.కాశింబీ(గుంటూరు జిల్లా), సలహా మండలి సభ్యులుగా అడిగోపుల వెంకటరత్నం(చిత్తూరు), కాటూరు రవీంద్ర త్రివిక్రమ్(ఎన్టీఆర్ జిల్లా), గబ్బిట దుర్గాప్రసాద్(కృష్ణా) ఎన్నికయ్యారు. ఈ కొత్త కార్యవర్గం 2023 నుంచి 2026 వరకు పదవీ బాధ్యతలు నిర్వహిస్తుంది.

ఎస్సీ విద్యార్థుల కోసం

విశాఖలో నీట్, జేఈఈ శిక్షణా కేంద్రం

సమీక్షలో మంత్రి నాగార్జున వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ విద్యార్థుల కోసం ప్రస్తుతం ఉన్న నీట్, జేఈఈ శిక్షణా కేంద్రాలు కాకుండా అదనంగా మరో శిక్షణా కేంద్రాన్ని విశాఖ జిల్లాలోని మధురవాడలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. ఎస్సీ గురుకుల విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకు వీలుగా మొత్తం 56 అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన బీఆర్ అంబేద్కర్ ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ల (డీసీఓ) ల సమీక్షా సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ బాలుర కోసం అడవితక్కెళ్లపాడు (గుంటూరు జిల్లా), చిన్నటేకూరు (కర్నూలు జిల్లా) లోనూ, బాలికల కోసం ఈడ్పుగల్లు (కృష్ణాజిల్లా) లోనూ నీట్, జేఈఈ శిక్షణా కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఈ శిక్షణా కేంద్రాలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని బాలికల కోసం మరో శిక్షణా కేంద్రాన్ని మధురవాడలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గురుకులాల విద్యార్థులు పదో తరగతిలో 80.38 శాతం, ఇంటర్మీడియట్‌లో 74.13 శాతం ఫలితాలను సాధించారని చెప్పారు. అయితే పదో తరగతి ఫలితాల్లో ఒక జిల్లా వెనుకబడిందని, ఆ జిల్లాలో రాష్ట్ర సగటు కంటే తక్కువగా 71 శాతం ఫలితాలు మాత్రమే వచ్చాయని తెలిపారు. అలాగే జూనియర్ ఇంటర్‌లో 63.19 శాతం ఫలితాలు మాత్రమే రాగా నాలుగు జిల్లాలు ఫలితాల సాధనలో వెనుకబడ్డాయని వివరించారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల్లో 1,400 మంది సింగిల్ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయిన వారు ఉన్నారని, వారందరూ ఉత్తీర్ణులయ్యేలా రాష్ట్ర వ్యాప్తంగా 56 అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని, 5వ తరగతిలో 14,940 సీట్లు ఉండగా వీటిలో తొలి విడతగా 13,881 మందిని ఎంపిక చేశామని అన్నారు. జూనియర్ ఇంటర్‌లో 13,520 సీట్లు ఉండగా వీటిలో 13,180 సీట్లకు తొలి విడతలోనే విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో ఉన్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు సంబంధించిన పదోన్నతుల ప్రక్రియను కూడా విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోపుగా పూర్తి చేయాలని కూడా మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపాల్స్‌కు ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడకు వెళ్లి చేరాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.పావనమూర్తి, సంయుక్త కార్యదర్శి శివరావు, ఏఎంఓ ఎన్.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన క్రూయిజ్ టెర్మినల్

విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

చైర్మన్ మాదేయాన్ అంగముత్తు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సరుకు రవాణాలో విశాఖ పోర్టు దేశంలోనే 2వ స్థానంలో నిలిచిందని విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ మదేయాన్ అంగముత్తు చెప్పారు. కాగా, విశాఖ పోర్టులో పర్యాటకులకు కనువిందు చేసే క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభోత్సవానికి సిద్ధమైందని తెలిపారు. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ 73.73 మిలియన్ టన్నుల సరుకు రవాణాతో సరికొత్త చరిత్ర సృష్టించిందని అంగముత్తు తెలిపారు. 7 శాతం వృద్ధి సాధించడంతో పాటు అత్యధిక సరుకు రవాణా రికార్డును నెలకొల్పిందని పేర్కొన్నారు. పోర్టు ప్రగతి నివేదికను ఆయన మంగళ వారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ఏడాది సరుకు రవాణాలో స్టీమ్ కోల్, క్రూడాయిల్, కుకింగ్ కోల్, ఎరువులు వంటి సరుకు రవాణాలో వృద్ధి నమోదు చేసిందని అంగముత్తు వివరించారు. 2022 ఫిబ్రవరి నుంచి ఎప్పుడు ఏ నౌక ద్వారా...ఏ సరుకు దిగుమతి అయిందో పూర్తి వివరాలు వెల్లడించారు. డాక్ ఏరియా, శాలిగ్రామపురం, ఫిషింగ్ హార్బర్, ఓఆర్ఎస్, రైల్వే అవుట్ డోర్ విభాగం, అగ్నిమాపక విభాగం కార్యనిర్వాహక భవనం లోపల, బయటా ప్రత్యేకంగా పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బేబీ కేప్(260 మీటర్ల పొడవు, 43 మీటర్ల వెడల్పు) వెస్సల్స్ ఇన్ హార్బర్‌లోకి వచ్చే విధంగా ఆధునీకరణ చేపట్టామని, రూ.151 కోట్లతో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారన్నారు. పోర్టు అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు, పనులు, అందుకు అవసరమైన అంచనా వ్యయాల గురించి ఆయన వివరించారు. విశాఖపట్నంను ప్రపంచ పర్యాటక పటంలో నిలిపే క్రూయిజ్ టెర్మినల్ త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. 2500 మంది పర్యాటకులు ఉండే క్రూయిజ్ వెసల్‌ను ఈ బెర్త్‌లో ఆపరేట్ చేయవచ్చన్నారు.

ఏపీ నుంచే నేరుగా హజ్ యాత్ర

- గన్నవరం విమానాశ్రయంలో ఎంబార్కేషన్ పాయింట్
- జూన్ 7 నుంచి 19 వరకు యాత్ర
- రోజూ 155 మంది వెళ్లేలా ప్రత్యేక ఎయిర్ లైన్స్
- మైనార్టీ శాఖ మంత్రి అంజాద్ బాషా

విశాలాంధ్ర-విజయవాడ: మొట్టమొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ నుంచి యాత్రికులు నేరుగా హజ్ యాత్రకు వెళ్లేందుకు ఎంబార్కేషన్ పాయింట్ సాధించామని ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ శాఖ మంత్రి అంజాద్ బాషా తెలిపారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో మొదటి ఫ్లోర్‌లోని సీసీఎల్ఏ కాన్ఫరెన్స్ హాల్‌లో మైనార్టీ శాఖ సెక్రటరీ ఎ.ఎం.డి. ఇంతియాజ్, హజ్ కమిటీ చైర్మన్ బి.ఎస్. గౌస్ లాజమ్ అధ్వర్యంలో జరిగిన హజ్ కమిటీ సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తొలిసారిగా గన్నవరం విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1,813 మంది యాత్రికులను నేరుగా పవిత్ర హజ్ యాత్రకు పంపడం జరుగుతుందన్నారు. జూన్ 7 నుంచి 19 వరకు కొనసాగే ఈ యాత్రకు ప్రతి రోజూ 155 మంది వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. కొత్తగా ఎంబార్కేషన్ పాయింట్ వచ్చాక వివిధ ఎయిర్ లైన్స్ ఏపీ నుంచి యాత్రికులను హజ్‌కు తీసుకువెళ్లి, మళ్లీ హజ్ నుంచి ఏపీకి తీసుకువచ్చే విధంగా ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు చెప్పారు. హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ నుంచి వెళ్లే ప్రతి ఒక్క యాత్రికుడి మీద రూ.80,000 అదనంగా భారం పడుతుందని తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి ప్రోద్బలంతో ప్రతి ఏటా యాత్రికుడిపై విమాన ప్రయాణానికి అయ్యే ఖర్చుకు అదనంగా ఒక్కొక్కరికి రూ.80,000 చొప్పున రూ.14.51 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించడం విశేషమన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ, హజ్ యాత్రికుల తరపున అంజాద్ బాషా కృతజ్ఞతలు తెలిపారు. హజ్ యాత్రికుల కోసం గుంటూరు జిల్లా నంబూరు వద్ద గల మదరసాలో వసతి ఏర్పాటు చేయనున్నామని అన్నారు. యాత్రికుల లగేజీని మదరసాలోనే స్కానింగ్ చేసి నేరుగా విమానాశ్రయానికి తరలించేలా ఎయిర్ పోర్టు అథారిటీ అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. ఆర్టీసీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 4 ఏసీ బస్సుల ద్వారా యాత్రికులను మదరసా నుంచి గన్నవరం విమానాశ్రయానికి పంపించే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అలాగే, 24 గంటలు పని చేసేలా మదరసా వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అవసరమైన వారికి వాక్సినేషన్ అందిస్తామని తెలిపారు. హజ్‌కు వెళ్లే యాత్రికులు వసతి కేంద్రం వద్దకు 24 గంటల ముందుగానే చేరుకోవాలని సూచించారు. మైనార్టీ సంక్షేమ శాఖ సెక్రటరీ ఇంతియాజ్ మాట్లాడుతూ గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్‌కు వెళ్లేవారి యాత్ర సవ్యంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు, హజ్ కమిటీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం.నవాబ్ బాషా, ఎమ్మెల్సీ, హజ్ కమిటీ సభ్యులు ఇసాక్, మైనార్టీ శాఖ సలహాదారు ఎస్.ఎం.జియావుద్దీన్, ఏపీ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నవాబ్ ఖాదర్ సాబ్, కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజబాబు, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, ఆర్డీవోలు, హజ్ యాత్రకు సేవలందిస్తున్న ఎయిర్ లైన్స్ అధికారులు, గన్నవరం ఎయిర్ పోర్టు అథారిటీ, కస్టమ్స్, బ్యాంకర్లు, ఆర్టీసీ, పంచాయతీరాజ్, పోలీసు, వైద్యారోగ్య శాఖ, విద్యుత్ శాఖ, మున్సిపల్ శాఖ, ఆర్ అండ్ బీ, బీఎస్ఎన్ఎల్, ఫైర్ సర్వీసు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

25న ఇప్టా 80వ వార్షికోత్సవం

ఘనంగా జరపాలని ప్రజానాట్యమండలి పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) 80వ వార్షికోత్సవం, విప్లవ సినిమాల నటుడు మాదాల రంగారావు 75వ జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మే 25వ తేదీన ఘనంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్యలు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అంటూ చైతన్యవంతమైన నినాదాన్ని అటు సాంస్కృతిక రంగానికి ఇటు సాహితీ లోకానికి అందించిన ఒక సజీవ స్రవంతి ఇప్టా అని పేర్కొన్నారు. 1943 మే 25న బొంబాయి నగరంలో ఇప్టా ఆవిర్భావం జరిగిందని ఆనాటి నుంచి ప్రజా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటోందని తెలిపారు. ఇప్టా ఎందరో కవులు, కళాకారులను తయారుచేసిందని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడమే కాకుండా తెలంగాణతో పాటు అనేక సంస్థానాలలో రాచరికానికి వ్యతిరేకంగా జాగిర్దారి, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా జన చైతన్యం కోసం కళారూపాల ద్వారా పోరాడిందనీ, పోరాడుతూనే ఉందన్నారు. ఇలాంటి తరుణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్టా వార్షికోత్సవాలను ప్రతి జిల్లాలోనూ మే 25 న ఇప్టా జెండాలను ఎగురవేసి వారి వారి శక్తి మేరకు సదస్సులను ఏర్పాటు చేసి కళా ప్రదర్శనలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడలోని విశాలాంధ్ర ప్రధాన కార్యాలయం చంద్రం బిల్డింగ్స్‌లో 'సాహిత్యం, కళలు, ప్రభుత్వ విధానం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సదస్సులో ముఖ్యఅతిథులుగా అరసం నాయకులు గుజ్జుల ఓబులేసు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సులో కవులు, రచయితలు, కళాకారులు, సాహితీ మిత్రులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని చంద్రానాయక్, పెంచలయ్య విజ్ఞప్తి చేశారు.

దళిత, గిరిజనుల సంక్షేమంపై

శ్వేతపత్రం విడుదల చేయాలి

గిడుగు రుద్రరాజు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగ బద్ధంగా అమలు కావలసిన ప్రత్యేక సంక్షేమం అభివృద్ధి పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు, గత నాలుగేళ్లలో ఈ అంశాల్లో సాధించిన ప్రగతిపై శ్వేత పత్రం విడుదల చేయాలని పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. దళిత గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ అంశాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని, వారి పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని అన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పేదల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన నవరత్నాలు కాకుండా, రాజ్యాంగ బద్ధంగా ఎస్సీ ఎస్టీలకు సంక్రమించిన ప్రత్యేక హక్కులు, చట్టాల పట్ల అనుసరిస్తున్న తీరు రాజ్యాంగ విరుద్ధంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీల విషయంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తే సహించేదిలేదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ , కొరివి వినయ్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్, నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు మదాన మోహన్ రెడ్డి, హరికుమార్ రాజు, మీసాల రాజేశ్వరరావు, కాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా కొవ్వొత్తుల ప్రదర్శన

బ్రిజ్ భూషణ్‌పై చర్యలకు మహిళా సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-విశాఖ: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఫిర్యాదు ఇచ్చి నెలలు కావస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని వక్తలు అన్నారు. గత నెల రోజులుగా దిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరవధిక ధర్నా చేస్తున్న రెజ్లర్లకు సంఘీభావంగా మంగళవారం విశాఖలో మహిళా సంఘాల ఐక్య వేదిక కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై విచారణ కమిటీని నియమించారని, ఆ కమిటీ నివేదికను బయట పెట్టకపోవడం దుర్మార్గమని విమర్శించారు. పితృస్వామిక ధోరణి ఇందులో ఇమిడి ఉందన్నారు. బ్రిజ్ భూషణ్‌పై అనేక నేర కేసులు ఉన్నాయని, అయోధ్య-బాబ్రీ మసీదు ధ్వంసం దుండగుల్లో మొదటి వరుసలో ఉన్నాడని చెప్పారు. అలాగే, హత్య, హత్యాయత్నం, లైంగిక దాడుల కేసులు ఉన్నాయని, అయినా ఎంపీ టికెట్ ఇచ్చారని తెలిపారు. అలాంటి వాడిని రెజ్లర్ల సమాఖ్యకు జాతీయ అధ్యక్షుడిగా నియమించడాన్ని తప్పుపట్టారు. తనను ఎవరూ ఏమీ చేయలేరన్న ధైర్యంతోనే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ రెజ్లర్లపై కూడా లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని మహిళా సంఘాల నేతలు ఆరోపించారు. నేరాలు చేయడమే అలవాటుగా ఉన్న సింగ్‌ను అరెస్టు చేయకపోగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై భౌతిక దాడులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా సింగ్‌ను కాపాడడం మానుకొని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించే విధానాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే దేశ వ్యాప్తంగా ఆందోళన ఉధృతంగా చేస్తామని ప్రకటించారు. ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు తమ సంపూర్ణ మద్దతును మహిళా సంఘాల ఐక్య వేదిక ప్రకటించింది. పీఓడబ్ల్యూ, జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, విద్యా చైతన్య మహిళా సంఘం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విమల, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు వెంకట లక్ష్మి, ప్రధాన కార్యదర్శి రోహిణి, కార్యదర్శి ఇందిర, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు లలిత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై ఏసీబీ కొరడా

విశాలాంధ్ర-విజయవాడ: అవినీతి అధికారులపై ఏసీబీ కొరడా ఝుళిపించింది. పోలీసు శాఖ, సేల్స్ ట్యాక్స్ అధికారులు ఇద్దరిపై ఫిర్యాదులు అందటంతో నిఘా పెట్టి మంగళవారం అరెస్టు చేసినట్లు ఏసీబీ ఇన్‌చార్జి డీజీ శంకరబాత్ర బాగ్చి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.సత్యహరి శ్రీనివాసరావుకు అదే ప్రాంతానికి చెందిన డ్రీమ్ స్టెప్ సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రైవేటు లిమిటెడ్ అధికారి బాల వీరమల్లికార్జునరావు జీఎస్టీ, ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్‌కు సంబంధించిన పత్రాలను అకౌంటెంట్ ద్వారా పంపగా అవి సక్రమంగా లేవని...లక్ష రూపాయలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా సత్యహరి శ్రీనివాసరావును అరెస్టు చేశారని బాగ్చి చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కందుల దుర్గాప్రసాద్... ఓ కేసులో సీజ్ అయిన కారు, స్టేషన్ బెయిల్, చార్జిషీట్‌లో పేరు తొలగించేందుకు పల్నాడు జిల్లా అబ్బూరు గ్రామానికి చెందిన గరికపాటి నాగమల్లేశ్వరరావును రూ.5లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఎస్ఐకి ఇచ్చే లంచంలో మొదటి విడతగా రూ.1,80,000 కానిస్టేబుల్ తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఎస్ఐను అదుపులోకి తీసుకున్నారని వివరించారు.

సంపాదకీయం

మోదీ ప్రచార కాంక్ష

ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చిన సంఘ్ పరివార్ కుదురుకు రాజ్యాంగంపై ఎన్నడూ నమ్మకం లేదు. 2019లో మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత రాజ్యాంగ వ్యవస్థలను కూడా ఛిన్నాభిన్నం చేశారు. అధికారంలోకి వచ్చినప్పుడు మోదీ పార్లమెంటు మెట్లకు మొక్కి తనకు ఆ వ్యవస్థపై అపారమైన విశ్వాసం ఉన్నట్టు నమ్మించడానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఉన్న పార్లమెంటు భవనాన్ని 1921-1927 మధ్య నిర్మించారు. దానిని 1927 జనవరిలో ప్రారంభించారు. అప్పుడు దానిని ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ అనే వారు. మన దేశంలో బ్రిటిష్ పాలన అంతమైన తరవాత రాజ్యాంగ నిర్ణాయక సభ ఆ భవనాన్ని స్వాధీనం చేసుకుంది. 1950లో భారత రాజ్యాంగాన్ని అమలుచేసిన తరవాత దానిని పార్లమెంటు భవనం అంటున్నాం. ఉభయ సభలైన లోకసభ, రాజ్యసభ కూడా ఈభవనంలో ఇప్పటిదాకా కొనసాగాయి. మరింత చోటు అవసరమైనందువల్ల 1956లో ఈ భవనంపై మరో రెండు అంతస్తులు నిర్మించారు. ఈ భవనం ఇప్పటికీ పదిలంగానే ఉంది. అయినా ప్రధాన మంత్రి తన ప్రచారకాంక్ష కారణంగా దాదాపు రెండువేలకోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి కొత్త భవనం నిర్మించారు. ఇది మరింత విశాలంగా ఉన్న మాట నిజమే. రేపెప్పుడో పార్లమెంటు సభ్యుల సంఖ్య పెరిగితే తగిన వసతి ఉండడానికి వీలుగా కొత్త భవనాన్ని నిర్మించిన మాట వాస్తవం. ప్రస్తుత పార్లమెంటు భవనంలో చోటు సరిపోవడం లేదన్న కారణంతో 2010లో నూతన పార్లమెంటు భవనం నిర్మించాలన్న ఆలోచన వచ్చింది. భవనం పాతదైపోతోందన్న కారణమూ ఉంది. 2012లో అప్పుడు లోకసభ స్పీకరుగా ఉన్న మీరాకుమార్ కొత్త భవననిర్మాణం గురించి ఆలోచించారు. పాతభవనాన్ని పటిష్ఠంగా ఉంచడంకోసం తగిన సూచనలు చేయడానికి ఓ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుత భవనం 93 ఏళ్ల నాటిది. పాత భవనంలో వసతి తక్కువైనా, అది మన వారసత్వంలో భాగం. దానిని పరిరక్షించడానికి తగిన ఏర్పాట్లు చేయవలసిన అవసరమూ ఉంది. 2019లో కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి కార్యక్రమం ప్రారంభించి అందులో నూతన పార్లమెంటు భవన నిర్మాణాన్ని కూడా చేర్చింది. అంతకు ముందున్న రాజ్ పథ్ పేరును కర్తవ్య పథ్‌గా మార్చింది. ఉప రాష్ట్రపతికి కొత్తఆవాసం ఏర్పాటుచేయాలని తలపెట్టింది. ప్రధాన మంత్రి కార్యాలయం, నివాసాన్ని కూడా కొత్తగా నిర్మించారు. ఒకే ఆవరణలో కేంద్ర సెక్రెటేరియట్ నిర్మాణం కూడా జరిగిపోయింది. మంత్రుల కార్యాలయాలన్నీ అక్కడే ఉంటాయి. నూతన పార్లమెంటు భవనానికి, తదితరభవనాలకు 2020 అక్టోబర్‌లో అంకురార్పణ జరిగింది. పార్లమెంటు భవనానికి 2020 డిసెంబర్ పదిన ప్రధానమంత్రి మోదీ శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ లాంఛనం పూర్తి అయినా కొన్ని అర్జీలు అందినందు వల్ల అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎం.ఎం. ఖాన్విల్కర్ సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి కార్యక్రమానికి కళ్లెంవేశారు. 2021 జనవరిలో సుప్రీం కోర్టు విధించిన ఆంక్ష తొలగిపోయింది. ఈ ఏడాది మార్చి 30న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కొత్తభవనానికి తుదిమెరుగులు దిద్దే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారంటున్నారు. దీనికి సంబంధించి పక్కన ఎవరూ లేకుండా మోదీ ఒక్కడి ఫొటోలు, వీడియోలు వెలువడ్డాయి. లోకసభస్పీకర్ గానీ, ఇతర ఉన్నతాధికారులు కానీ ఆ చుట్టు పక్కల ఎక్కడా కనిపించలేదు. మోదీ మీద మాత్రమే దృష్టి కేంద్రీకరించి ఫొటోలు, వీడియోలు తీశారు.

వచ్చే ఆదివారం (28వ తేదీ) కొత్త పార్లమెంటుభవనం ప్రారంభిస్తారు. అదే రోజు సావర్కర్ జన్మదినం. కొత్త పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించిన దాఖలాలు ఇప్పటి దాకా ఐతే లేవు. అందువల్ల ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కాకూడదని కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. దేశం తీవ్ర ఆర్థికసంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో 2,11,000 కోట్ల రూపాయల అప్పులు తల మీద కత్తిలా వేలాడుతున్నప్పుడు రెండువేల కోట్లు ఖర్చుపెట్టి కొత్త పార్లమెంటు భవనం, తదితర భవనాల నిర్మాణం అవసరమా అన్న ప్రశ్నకు ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక సమాధానం అయితే లేదు. దేశ ఆర్థికపరిస్థితి క్లిష్టదశలో ఉన్నప్పుడే నర్మదా నది తీరంలో 182 మీటర్ల ఎత్తైన సర్దార్‌పటేల్ విగ్రహాన్ని నెలకొల్పడానికి ప్రభుత్వం మూడువేల కోట్ల రూపాయలు వెచ్చించింది. దీని ప్రచారంకోసం మరో రూ.2.64కోట్లు ఖర్చుపెట్టారు. దాన్ని కూడా మోదీనే ఆవిష్కరించారు. అహ్మదాబాద్‌లోని సర్దార్‌పటేల్ క్రికెట్‌స్టేడియం దేశంలోకెల్లా విశాలమైంది. దానికి మరమ్మతులు చేశారు. అందులో భాగంగా సర్దార్ పటేల్ పేరు మాయమై నరేంద్రమోదీ స్టేడియంగా రూపాంతరం చెందింది. పార్లమెంటు భవనాన్ని ప్రధానమంత్రి, కాదు మోదీ ప్రారంభించడంలో ఔచిత్యం ఏమిటో ఎంత తరచిచూసినా అంతుబట్టదు. న్యాయంగా అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించాలి. ఎందుకంటే భారత పార్లమెంటు అంటే కేవలం భవనం కాదు. మన పార్లమెంటు అంటే రాష్ట్రపతి, పార్లమెంటు ఉభయ సభలు. అలాంటిది రాష్ట్రపతి ప్రమేయం లేకుండా కొత్త భవనం ప్రారంభోత్సవం జరిగిపోవడంఅంటే కేవలం ద్రౌపది ముర్మును అవమానించడమే కాదు. పార్లమెంటు వ్యవస్థను, రాష్ట్రపతి వ్యవస్థను కూడా అవమానించడమే. ప్రధానమంత్రి మోదీకి ఉన్న ప్రచారార్భటం అందరికీ తెలిసిందే.

ఆయన వేషధారణమీద అపారమైన డబ్బు ఖర్చవుతుంది. ఈ ఖర్చంతా ప్రభుత్వఖజానాలోంచి చెల్లించాల్సిందే. ఆయన నూతన పార్లమెంటు భవనం పనులు ఎంతవరకు పూర్తి అయినాయో తనిఖీ చేసినప్పుడు ఆ చుట్టుపక్కల మానవ మాత్రులు ఎవరూ కనిపించని మాట వాస్తవమే. కానీ ఎవరికీ కనిపించకుండా ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లో ఎక్కడో పొంచిఉండి ఫొటోలుతీశారుగా! మోదీ అప్పుడప్పుడు హిమాలయాల్లోకి వెళ్లి ధ్యానంచేస్తున్న ఫొటోలుసర్వవ్యాప్తం అవుతుంటాయి. అప్పుడూ పరిసరాల్లో ఎవరూ ఉండరు. ఆయన తల్లి ఆశీర్వాదం తీసుకోవ డానికి వెళ్తుంటారు. అప్పుడూ ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఉండా ల్సిందే. కానీ వారు కనిపించకుండానే తమ విధులు నిర్వహిస్తారు కాబోలు! తన తల్లి తనకు రూపాయి పావలాఇచ్చారని మోదీ గొప్పగా చెప్పుకుంటారు. ఆమెకు మోదీభోజనం తినిపిస్తున్న చిత్రాలూ విరివిగానే ప్రచారంలో పెద్దారు. తనను ఫొటోలు తీస్తున్నప్పుడు ఎవరు అడ్డం వచ్చినా మోదీ సహించరు. కొన్ని సందర్భాలలో అడ్డం వస్తున్నారనుకునే వారిని మోదీ స్వయంగా పక్కకుతోసేస్తారు. మోదీకిఉన్న కీర్తికాంక్ష అద్వితీయ మైంది. "నేనొక్కడిని, నా మీద ఇంతమంది దాడి చేస్తున్నారు చూడండి" అని పార్లమెంట్ సాక్షిగా మోదీ ఆక్రోశించారు. నిజమే ఆయన ఎవరితోనూ ఎందులోనూ, ఎప్పుడూ భాగస్వామి అయిన దృష్టాంతమే ఉండదు. ఆయనొక్కడే మరి. ఆయన ప్రచార కాంక్ష ముందు అన్నీ బలాదూరే.

కాంగ్రెస్ బహుళ వ్యూహాలు అనుసరించాలి

జ్ఞాన్‌పాఠక్

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో పటిష్టమైన వ్యూహాన్ని అనుసరించడం కాంగ్రెస్ గెలుపుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం చివరలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు, 2024లో జరగనున్న లోకసభ ఎన్నికల్లో గెలుపొందడానికి బహుళ వ్యూహాలు రచించుకుని అనుసరించాలి. అలాగే వివిధ రాష్ట్రాల్లో పార్టీలో నెలకొన్న అంతర్గత తగాదాలను పరిష్కరించుకోవాలి. దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసుకుని అదే సమయంలో ప్రతిపక్షాలతో కలిసి పోటీచేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. రాహుల్ గాంధీ నిర్వహించిన జోడోయాత్ర కర్నాటకలో ప్రభావం చూపిందని భావిస్తున్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ దీని ప్రభావం ఎంతో అప్పుడే నిర్ణయించలేం. అయితే ఈ యాత్ర ప్రజాదరణ పొందిందని చెప్పవచ్చు. అసమ్మతిని అణచివేయడం, అవినీతిని పెంచడం, ఆర్థికరంగాన్ని కుదేలుపరచడం విచ్ఛిన్నకర, విద్వేష నియంతృత్వ పోకడలను మోదీ అనుసరిస్తున్నదని కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు విమర్శించడం ప్రధానంగా ఎంచుకున్నారు. మోదీ అనుసరిస్తున్న మతవాద విధానాలు దేశ సెక్యులర్, ప్రజాస్వామ్య వ్యవస్థను, పునాదులను దెబ్బతీస్తున్నదని కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. హిందూజాతీయవాద అజెండాను మోదీ అనుసరిస్తూ దేశవ్యాప్తంగా మత ఉద్రిక్తతలకు, ఘర్షణలకు కారణమవుతున్నారని కూడా కాంగ్రెస్ పదేపదే విమర్శిస్తున్నది. ప్రత్యేకించి హిందూ మెజారిటీ ప్రజల, ముస్లిం మైనారిటీల మధ్య తీవ్ర విభేదాలు, చీలికలను సృష్టిస్తున్నారని, క్రిస్టియన్ ప్రజలను లక్ష్యంగా చేసుకున్నారని కాంగ్రెస్ తీవ్రంగానే విమర్శిస్తున్నది. కర్నాటకలో ఎన్నికల సందర్భంగా ప్రచారంలో బజరంగ బలికి జై నినాదాన్ని, కేరళ స్టోరీ, కశ్మీర్ ఫైల్స్ సినిమాలు పూర్తి వాస్తవాలనికూడా మోదీ మాట్లాడారు. రాష్ట్రంలో లవ్‌జిహాద్, హిజాబ్ అంశాలతో సమాజంలో కల్లోలాలను బీజేపీ సృష్టించింది. ఇదే సమయంలో కాంగ్రెస్ సెక్యులర్ భావజాలాన్ని ప్రదర్శించింది.

మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం, అక్రమాలకు, ఆర్థికసంక్షోభానికి కారణమవుతున్న అదానీ లాంటివారిని ప్రోత్సహిస్తున్నారని అవసరమైతే ఇలాంటి వాళ్లకోసం నియమనిబంధనలను సైతం మార్చివేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కార్పొరేట్ అనుకూల విధానాలు కూడా అనుసరిస్తున్నారు. ఈ అంశాలన్నీ కర్నాటకలో కాంగ్రెస్ విజయానికి దోహదంచేశాయి. అయితే ఇవే అంశాలను తీసుకుని ఇతర రాష్ట్రాల్లో విమర్శలు చేయడం వల్ల విజయానికి దోహదం చేయకపోవచ్చు. ఈ ఏడాది చివరికి రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్, తెలంగాణ, మిజోరంలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉండగా రాజస్థాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ వివిధ గ్రూపులుగా ఉంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అనుసరించవలసిన ఎత్తుగడలు, వ్యూహాలు పటిష్టంగా, బహుళంగా ఉండాలి. మోదీ ఆకర్షణశక్తి ఈ రాష్ట్రాలలోనూ ఉంది. కర్నాటకలో మోదీ ఆకర్షణశక్తి తగ్గిందని భావిస్తున్నారు. పార్టీని పటిష్టం చేసుకుంటేనే కాంగ్రెస్ మోదీని గట్టిగా ఢీ కొనగలదు. హిందూ మత రాజకీయాలు, మతాల మధ్య అల్లర్లు, మోదీ ప్రతిష్టను దిగజార్చాయి. అదే సమయంలో విద్వేష నేరాలు, మైనారిటీలపై హింసాకాండ మోదీ హయాంలో గణనీయంగా జరిగాయి. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారింది. విమర్శకులపై దాడులు చేయడం, దేశద్రోహ చట్టాలు అమలుచేసి జైళ్లలో పెట్టి హింసించడం, జర్నలిస్టులను బెదిరించడం, జైళ్లలో పెట్టడం లాంటి అంశాలన్నీ కాంగ్రెస్ ప్రచారంలో పెడుతోంది. ధనికులు అనుకూల, పేదల వ్యతిరేక విధానాలను ప్రధానంగా మోదీ అనురిస్తున్నారు. ఉద్యోగాలను సృష్టించడంలో పూర్తిగా విఫలమయ్యారు. అలాగే పెద్దనోట్ల రద్దు, కుబేరులకు ఉపయోగపడింది. సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో కోతలు వంటి అంశాలపై కూడా కాంగ్రెస్ గట్టిగానే విమర్శిస్తున్నది.

తొమ్మిదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలు గొప్పగా ఏమీ లేవు. అధికంగా పాలనా వైఫల్యమే కనిపిస్తున్నది. ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ అంశాలను మరుగుపరచి వారి దృష్టిని మళ్లించేందుకు అసంబద్ధమైన అంశాలను ప్రస్తావించి హిందూ మెజారిటీ ప్రజలలో భావోద్వేగాలను రెచ్చ గొడుతున్నారు. ఈ అంశాలలో కాంగ్రెస్ తగినవిధంగా గట్టిగా స్పందించగలగాలి. ప్రభుత్వ లోపాలను ప్రజలకు వివరించాలి. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ సాహసోపేతంగా ప్రచారం చేయడం ఒక వ్యూహం. స్వీయరక్షణ భావంతోకాకుండా బీజేపీ ప్రభుత్వం చేసిన తప్పులను బహిరంగ పరచాలి. ప్రతిపక్షాలతో పొత్తులను కుదుర్చుకోవడంలో ప్రాంతీయ పార్టీల మధ్య ఉదారంగా, సామరస్యంగా మెలగవలసిన అవసరం ఉంది.

నల్లధనం పేరుతో అనేకసార్లు నోట్ల రద్దు!

నల్లధనం నిర్మూలన పేరుతో ఇప్పటికి అనేకసార్లు పెద్దనోట్లు రద్దు చేశారు. గతంలో పరిస్థితి వేరు. ఇప్పుడు నరేంద్రమోదీ ప్రభుత్వం పెద్దనోట్లు రద్దుచేసి నల్ల ధనులకు ప్రయోజనం కల్పించారు. రాజ్యాంగంలోని అన్ని అంగాలు అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి లోబడి పనిచేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మోదీ ప్రభుత్వ డైరెక్షన్‌లో రిజర్వుబ్యాంక్ రెండువేల నోట్ల వినియోగం ఆపివేయాలని 19-5-23న ఆదేశించింది. మార్కెట్లో నోట్ల చలామణిని బట్టి కొత్తనోట్లను తీసుకురావటం, ఉపసంహరించుకోవటం వంటి 19-05-23 నిర్ణయాలు తీసుకునే అధికారం తనకుందని పేర్కొంది. రిజర్వుబ్యాంక్ ఏమిచెప్పినా మోదీ చెప్పిన దాని ప్రకారమే రెండువేల నోటు ఉపసంహరణ అనేది ప్రజలకు తెలియంది కాదు. 2016లో పెద్దనోట్ల రద్దును రిజర్వుబ్యాంక్ ప్రకటించకుండా మోదీ ప్రకటించటంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తటంతో, ఇప్పుడు రెండువేల నోట్ల ఉపసంహరణను రిజర్వు బ్యాంక్ చేత మోదీ చెప్పించారనేది ప్రజలు గ్రహించారు.

దేశంలో నోట్లరద్దు అనేక సార్లు జరిగింది. 1978లో ప్రధానిగా మొరార్జీదేశాయ్ 100 రూపాయలకు మించిన కరెన్సీని నిషేధించారు. రెండు సందర్భాల్లో నల్లధనం ముప్పు పేరుతో పెద్దనోట్లను రద్దు చేయాలని ప్రభుత్వంపై రిజర్వు బ్యాంక్ ఒత్తిడి చేయటంతో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం 5,10 వేల నోట్లను ఉపసంహరించుకుంది. 10వేల నోటును బ్రిటిష్ పాలనలో 1938లో రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా ముద్రించింది. ఈ నోటు 1954లో కొత్త రూపంలో వచ్చింది. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం 1945 జనవరిలో తిరిగి 1978 జనవరిలో ఈ నోటును రద్దు చేశారు. మొరార్జీ దేశాయ్ అధికారంలోకి వచ్చినప్పుడు 5,10 వేలనోట్లు చెలామణిలో ఉన్నాయి. వ్యాపార లావాదేవీలకు సులభంగా ఉంటుందనే కారణంతో నవంబర్ 2000 సంవత్సరంలో వాజ్‌పేయి ప్రభుత్వం మళ్లీ వెయ్యి రూపాయల నోటును ప్రవేశ పెట్టింది. 1987 అక్టోబర్‌లోనే 5వందల నోటు కూడా తిరిగి చలామణిలోకి వచ్చింది. ద్రవ్యోల్బణం కారణంగా నోట్ల పరిమాణాన్ని నియంత్రించే చర్యగా దీన్ని సమర్థించుకున్నారు. ఈ నోట్ల రద్దు, పునరుద్ధరణ నల్ల ధనాన్ని ఆపలేకపోగా పెంచింది. విదేశాలకు తరలింపు ఎక్కువైంది. పేదరికం, ధరలు పెరగటానికి కారణమైంది.

2016 నవంబర్‌లో పెద్దనోట్ల రద్దుకు ప్రధాని మోదీ మూడు కారణాలు చెప్పాడు. నల్లధనం నిర్మూలన, నకిలీ నోట్లను అరికట్టటం, ఆర్థిక ఉగ్ర వాదాన్ని అరికట్టటం. ఈ మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించటానికే. పెద్ద

నోట్ల మొత్తం విలువ 17.7 లక్షల కోట్లు. నోట్ల రద్దు తర్వాత బ్యాంకులకు తిరిగి వచ్చింది సుమారు 16 లక్షల కోట్లకుపైమాటే. చాలా తక్కువ మాత్రమే తిరిగి రాలేదు. దీన్ని గమనిస్తే నల్లడబ్బు 10వేల కోట్లు కూడా దాటలేదు. విదేశాల్లో మూలుగుతున్న నల్ల డబ్బులు 12.5 లక్షల కోట్లకు పైగాఉన్నాయి. ఈ వాస్తవాలు పెద్దనోట్ల రద్దు వలన నల్లడబ్బు బయటకు రాలేదని తెలుపుతున్నది. నోట్ల రద్దు తర్వాతే నల్లడబ్బు విదేశాలకు ఎక్కువగా తరలిపోయిందని వాస్తవాలు తెలుపుతున్నాయి. దేశం మొత్తం వాణిజ్యంలో సగటున 10శాతం పైగా లెక్కల్లో లేకుండా తరలిస్తున్నది. భారత్ నుంచి విదేశీ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన మొత్తం నల్లధనం లెక్కలు ప్రభుత్వం వద్దలేవని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పటం ప్రభుత్వ తీరుకు అద్దం పడుతున్నది. నోట్ల రద్దుకు చెప్పిన రెండవ కారణం, నకిలీ నోట్లకు అడ్డుకట్ట వేయవచ్చని. ఇది ప్రజలను పక్కదారి పట్టించటమే. ప్రస్తుత చెలామణిలో ఉన్న నగదులో నకిలీ నోట్లు 0.02శాతం మాత్రమేనని ఆర్‌బీఐ అంచనా వేసింది. దొంగనోట్ల ముద్రణ ప్రభుత్వంలోని కొందరు పెద్దల మద్దతుతోనే జరుగుతున్న విషయం ప్రజలు గమనిస్తున్నారు. మూడో కారణం ఉగ్ర ఆర్థిక వనరులను దెబ్బతీసి తీవ్రవాద కార్యక్రమాలను అరికట్టటం. అందుకు భిన్నంగా అవి పెడుతూనే ఉన్నాయి. ఉగ్రవాదం పేరుతో ప్రజా ఉద్యమాల అణచివేతను మోదీ ప్రభుత్వం ముమ్మరం చేస్తున్నది. పెద్దనోట్ల రద్దు దేశ ఆర్థికవ్యవస్థను మెరుగుపర్చకపోగా మరింతగా దిగజార్చింది.

వ్యవసాయం, చిరువ్యాపారాలు, తయారీ, నిర్మాణ రంగాలు కుదేలయ్యాయి. చిన్న పరిశ్రమలు సంక్షోభంలోకి వెళ్లాయి. గ్రామీణ, పట్టణ ఉపాధి అవకాశాలు పడిపోయాయి. పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. పెద్ద నోట్ల రద్దులో మోదీ ఉద్దేశమే వేరు. నల్లధనాన్ని వెలికి తీయటం అందులో లేదు. నల్ల కుబేరుల వద్ద ఉన్న నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవటానికి అవకాశం కల్పించేందుకే పెద్దనోట్ల రద్దు నాటకం. అంతర్జాతీయ బ్యాంకుల్లో నల్లధనం దాచిన 50 మంది భారతీయుల పేర్లను జర్మనీ ప్రభుత్వం, మోదీ ప్రభుత్వానికి పంపింది. పనామా విడుదల చేసిన పత్రాల్లోనూ భారతీయుల పేర్లు మూడు వందలు ఉన్నాయి. నల్ల కుబేరుల పేర్లు బయటకు వచ్చినా మోదీ ప్రభుత్వం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. విదేశీ బ్యాంకుల్లో ఉన్న నల్లధనంపై అంచనా లెక్కలు ఇలా ఉన్నాయి. 2011లో విదేశాల్లో ఉన్న నల్లడబ్బు బీజేపీ 28 లక్షల కోట్లుగా చెప్పింది. స్విస్ బ్యాంక్ నివేదిక ప్రకారం నల్ల డబ్బు 87 లక్షల కోట్లు, ప్రపంచ ఆర్థిక సమగ్రత నివేదిక లెక్కల ప్రకారం 20 లక్షల కోట్లు. విదేశాల్లో ఉన్న నల్ల డబ్బు ఎంత అన్నది మోదీ ప్రభుత్వానికి, విదేశీ బ్యాంకులకు మాత్రమే ఎరుక.

2014 ఎన్నికల ప్రచారంలో విదేశాల్లో ఉన్న నల్లడబ్బును దేశంలోకి రప్పించి ప్రతి వ్యక్తికి 12లక్షలు ఇస్తానని మోదీ చెప్పారు. ఇప్పుడు దాని ప్రస్తావనే లేదు. ఇది ప్రజలను మోసగించటం, అబద్ధాలు చెప్పటం కాదా! పెద్దనోట్ల రద్దు నల్లడబ్బును అరికట్టడం కోసమని చెప్పిన మోదీ ఇంకా పెద్దదైన రెండువేల నోటును కొత్తగా ఎందుకు ముద్రించాల్సి వచ్చింది. ఉన్న ఐదు వందల నోటు స్థానే కొత్త ఐదువందల నోటు ముద్రణ ఎందుకు. ఈ నోట్ల ముద్రణకు 16 వేల కోట్ల ప్రజాధనం ఎందుకు ఖర్చుచేయాలి. వీటన్నిటినీ పరిశీలిస్తే అంబానీ, అదానీ లాంటి కుబేరుల ప్రయోజనాలకోసమే పెద్దనోట్ల రద్దు అన్నది స్పష్టమే. మోదీ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు వనరులు లేకుండా చేయటానికి రెండువేల నోటు రద్దు చేసిందని కొందరు విశ్లేషణ కూడా చేశారు. నల్ల కుబేరుల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం చేసిన పెద్దనోట్ల రద్దు, ఉపసంహరణ విధానాలను వ్యతిరేకించాలి. విదేశాల్లో ఉన్న నల్లడబ్బును దేశానికి రప్పించి ప్రజలకు పంపిణీ చేయాలని ప్రజలు ఉద్యమించాలి.

బొల్లిముంత సాంబశివరావు, సెల్: 9885983526

మాస్టారుకి కన్నీటి వీడ్కోలు

ఇ-మెయిల్

ప్రొఫెసర్ కేతు విశ్వనాథరెడ్డి మాస్టారుగారు నేను కందుకూరులో ఇంటర్మీడియట్ చదివేటప్పుడు మాకు తెలుగు మాస్టారు. ఆయనచాలా హుందాగా, అభ్యుదయ భావాలతో ఉండేవారు. అలానే ఏఐఎస్ఎఫ్ విద్యార్థులకు రాజకీయాలు బోధించడమేకాక, ఆయన కళాపిపాసి. నాకు బాగా గుర్తు, మాస్టారు రాసిన వలలో చేపలు నాటకం, మా కళాశాల విద్యార్థులు ప్రదర్శించారు. దానికిమంచి రెస్పాన్స్ రావడమేకాక బహుమతి కూడా వచ్చింది. అక్క మాధవి మమ్మల్ని చాలాబాగా చూసుకునేవారు. మాస్టారు,మాస్టారు భార్య మేం విద్యార్థులం అనే తారతమ్యం లేకుండా ఒక కుటుంబంగా ఉండేవారం. మాస్టారుగారి తోడల్లుడు శ్రీ రామిరెడ్డి మాస్టారు మాకు బోటనీ బోధించేవారు. ఈయన కూడా నాకు జీవితంలో మరువరాని సహాయం చేశారు. పార్టీ ఆఫీసులో ఉంటే పరీక్షలకు ముందు సరిగా చదువు సాగడం లేదని వాళ్ల ఇంట్లో ఉండి పరీక్షలు రాశాను. అలా ఉన్నతమైన భావాలతో మమ్మల్ని తీర్చిదిద్దిన మాప్రియతమ మాస్టారుకి అశ్రు నివాళులు అర్పిస్తున్నాను.

డా. రజని, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ కార్యదర్శి

మణిపూర్ మంటలకు పరిష్కారం లేదా..!

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో తాజాగా మరోసారి మంటలు చెలరేగాయి. రాష్ట్రంలో దీర్ఘకాలంగా గిరిజన తెగలు, గిరిజనేతరుల మధ్య నెలకొన్న విభేదాలు, అంతర్ పోరాటాలు సమాజంలో శాంతి లేకుండా చేశాయి. ఈ నెల ప్రారంభంలో జరిగిన తీవ్ర అల్లర్లు, గృహదహనాలు భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరిగింది. సైన్యం, పారామిలిటరీ దళాలు మోహరించి పరిస్థితిని అదుపు చేయగలిగారు. ఉద్రిక్త వాతావరణం నెలకొని ఉంది. అక్కడ పరిస్థితి చేయిదాటి పోతుందని తెలిసి కూడా కేంద్ర ప్రభుత్వం చొరవతీసుకుని సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు ఇంతవరకు ప్రయత్నించక పోవడం విచారకరం. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఘర్షణల్లో 1700 ఇళ్లు దహనమయ్యాయి. దాదాపు వందమంది ప్రాణాలు కోల్పోయారు. 35వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు.

నేడు మణిపూర్‌లో మెయిటీ, కూకీ, నాగా వివిధ వర్గాల మధ్య దీర్ఘకాలికంగా నెలకొన్న విభేదాలు భగ్గుమనడం, కేంద్ర, రాష్ట్ర పాలకులు, రాజకీయ వ్యవస్థలు సకాలంలో స్పందించకపోవడంతో వివిధ తెగలకు చెందిన ప్రజల మధ్య రేగిన హింసాత్మక ఘటనల్లో ప్రాణ, ఆస్తి నష్టం భారీగానే జరిగింది. కూకీ-జో, నాగా మైనారిటీ గిరిజన తెగల మధ్యనే కాకుండా మెజారిటీ మెయిటీ (50శాతం జనాభా), కుకీ-జో/నాగా జాతుల మధ్య విభేదాలు కూడా భగ్గుమనడం తరుచుగా చూస్తున్నాం. మెజారిటీ మెయిటీ వర్గాలకే అధిక ప్రభుత్వ నిధులు కేటాయిస్తున్నారని, కూకీ/నాగా గిరిజన తెగల అభివృద్ధికి ప్రభుత్వ నిధులు అందడంలేదని రెండు వర్గాలు పోరుకు పూనుకుంటున్నాయి. మణిపూర్‌లో అమలులో ఉన్న ప్రత్యేక అధికారాలు కలిగిన సాయుధ బలగాలపై స్థానికుల వ్యతిరేకత, స్థానిక మహిళల మానభంగ ఆరోపణలు కూడా అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. మణిపూర్‌లోని మెజారిటీ మెయిటీలు తమను ఎస్‌టీల జాబితాలో చేర్చాలని అనాదిగా కోరుతూ ఆందోళనలు, నిరసనలు చేస్తూనే ఉన్నారు. మెయిటీలను ఎస్‌టీలుగా గుర్తిస్తే పేదరికం అనుభవిస్తున్న కూకీ గిరిజనులు తమకు తీవ్ర అన్యాయం జరిగి తమ అవకాశాలు సన్నగిల్లుతాయని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గిరిజన కూకీలు ఆందోళనలు ఉధృతం చేయడంతో రెండు వర్గాల మధ్య అల్లర్లు తారస్థాయికి చేరాయి.

ఈ విషయంలో రాష్ట్ర హైకోర్టు ఏప్రిల్‌లో మెయిటీ వర్గం పక్షాన తీర్పును ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖకు ఎస్టీ రిజర్వేషన్‌కు సంబంధించి సిఫార్సు చేయాలని సూచించింది. మెయిటీలను

ఎస్టీ జాబితాలో చేర్చితే తమకు అన్యాయం జరగవచ్చని భావించిన ఇతర మైనారిటీజాతులు ఆందోళనలకు పూనుకోవడం పుండుమీదకారం చల్లినట్లు అయ్యింది. మణిపూర్‌లోని మెజారిటీ మెయిటీ తెగకు చెందిన ప్రజలు సాంఘిక, రాజకీయ, విద్య, ఆర్థిక విషయాల్లో ఇతర జాతుల కన్నా ఉన్నత స్థానంలో ఉండడంతో పేదరికంలోమగ్గుతున్న ఎస్టీ వర్గ కుకీ-జోకు చెందిన మైనారిటీ గిరిజనతెగలు మెయిటీల ఎస్టీనినాదాన్ని వ్యతిరేకిస్తున్నారు. మెయిటీలకు అనుకూలంగా ఉన్న రాష్ట్ర హైకోర్టు తీర్పును వ్యతిరేకించి విమర్శించిన 'ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ మణిపూర్ (ఏటియస్‌యూయం)', అసెంబ్లీ 'హిల్ ఏరియా కమిటీ' చైర్మన్‌లకు కోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో హింస మరింత పెరిగింది. మెయిటీ తెగను ఎస్టీజాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకించిన ఏటియస్‌యూయం సంఘం రాష్ట్ర రాజధానితో పాటు అన్ని జిల్లాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించడం, అది హద్దులు దాటి హింసాత్మకంగా మారడం, రెండు తెగల మధ్య దూరం పెరగడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ 'ఇన్నర్ లైన్ పర్మిట్' విధానంతో మెజారిటీ మెయిటీ ప్రజలు అభ్యంతరాలను తెలుపుతున్నారు. దాదాపు 50 శాతానికి పైగా జనాభా మెయిటీ తెగవారే ఉన్నప్పటికీ ఇతర మైనారిటీ తెగలు (కూకీలు/నాగాలు) తమపై ఆధిపత్యాన్ని చూపవచ్చునికూడా భావించడంతో అల్లర్లు పెరుగుతున్నాయి.

బిరేన్ సింగ్ నాయకత్వంలోని మణిపూర్ బిజేపీ ప్రభుత్వం సాయుధ దళాలు/యునైటెడ్ పీపుల్స్ ఫ్రంట్/కూకీ నేషనల్ ఆర్గనైజేషన్‌పై ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలు కూడా గొడవలకు కారణ మయ్యాయి. బిజేపి పాలనలోని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్న కూకీ-జో తెగ సమూహాలు హింసాత్మక దారులను ఎంచుకోవడం గమనిస్తున్నాం. ఇటీవల మణిపూర్‌లోని కొన్ని చర్చిలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేసే నిర్ణయం తీసుకోవడం కూడా కూకీ గిరిజన క్రిస్టియన్ వర్గాల ఆందోళనకు కారణం అవుతున్నది. కూకీ తెగ వారు డ్రగ్ అక్రమ వ్యాపార బర్మీస్‌కు చెందిన తీవ్రవాదులతో కలిసి హిందువులపై దాడులు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. లోయ ప్రాంతాలతో పోల్చితే కొండ ప్రాంతాల్లో ఆదాయ వ్యత్యాసాలు పెరిగి ఆర్థిక అసమానతలు పెరిగాయి. కొండ ప్రాంత జిల్లాల్లో మెయిటీలు భూమిని కొనడాన్ని నిషేధించడం, మెయిటీలు అధికంగా ఉన్న లోయ ప్రాంత జిల్లాల్లో ఇతర గిరిజన తెగలు భూమిని కొనవచ్చనే నియమం కూడా ఆందోళనలకు ఊతం ఇస్తున్నది. మెయిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూకీ వర్గ ప్రజలను, కూకీలు అధికంగా ఉన్న కాలనీల్లో మెయిటీ వర్గ ప్రజలను లక్ష్యంగా చేసుకొని అల్లర్లు జరగడంతో ఇరుపక్షాల అమాయక ప్రజలు ప్రాణభయంతో శరణార్థులుగా సురక్షిత ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లడం హృదయవిదారకంగా ఉన్నది.

మణిపూర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం, వివిధ తెగలకు చెందిన వర్గాలతో చర్చలు జరపడం, మైనారిటీలకు రక్షణ చర్యలు చేపట్టడం, మెజారిటీ వర్గాల అభిప్రాయాలను గౌరవించడం, మాదక ద్రవ్యాల ముఠాలను, తీవ్రవాద గ్రూపులను నియంత్రించడం, ఓటు బ్యాంకు రాజకీయాలకు అతీతంగా సమగ్రాభివృద్ధి చర్యలుచేపట్టడం, అందరికీ సమన్యాయం అందించడం, అసమానతలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. మణిపూర్‌లో శాంతి పావురాలు స్వేచ్ఛగా ఎగిరేలా సానుకూల వాతావరణాన్ని నెలకొల్పాలి.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి, సెల్: 9949700037

ఢిల్లీ పోలీసుల అమానుషం

- సిసోడియా మెడపట్టి లాక్కెళ్లిన వైనం
- వీడియో విడుదల చేసిన ఆప్
- కేజ్రీవాల్, మంత్రుల ఆగ్రహం

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా తో పోలీసులు దారుణంగా ప్రవర్తిస్తున్నారని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు తీవ్రంగా ఆరోపించారు. సిసోదియాను పోలీసులు లాక్కెళ్తున్నట్లు ఉన్న ఓ వీడియోను ఆప్ పోస్ట్ చేసింది. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడింది. మద్యం కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో సిసోదియా కస్టడీ మంగళవారంతో ముగిసింది. దీంతో ఢిల్లీ పోలీసులు ఆయనను నేడు కోర్టులో హాజరుపర్చారు. కోర్టు గది నుంచి సిసోదియాను బయటకు తీసుకొస్తుండగా మీడియా ఆయనను చుట్టుముట్టింది. ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, బదిలీలపై నియంత్రణాధికారం ఆ రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అడ్డుకునేందుకు కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై విలేకరులు అడగ్గా... 'మోదీజీ చాలా అహంకారిగా మారారు. ఆయనకు ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేదు' అని సిసోదియా బదులిచ్చారు. అయితే, సిసోదియాను ప్రశ్నిస్తుండగా ఓ పోలీసు అధికారి... విలేకరుల ఫోన్లను తోసేశారు. ఆ తర్వాత సిసోదియా మెడ చుట్టూ చేయి వేసి బలవంతంగా లాక్కెళ్లారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు సోషల్‌మీడియాలో షేర్ చేశారు. 'రౌస్ అవెన్యూ కోర్టులో సిసోదియాతో ఓ పోలీసు అధికారి దురుసుగా ప్రవర్తించారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలి' అని ఢిల్లీ మంత్రి అతిషి డిమాండ్ చేశారు. ఈ వీడియోపై కేజ్రీవాల్ స్పందిస్తూ మనీశ్‌తో ఇలా దురుసుగా ప్రవర్తించే అధికారం పోలీసులకు ఉందా? లేదంటే ఇలా చేయమని పోలీసులను ఎవరైనా ఆదేశిస్తున్నారా అని కేంద్రంపై పరోక్షంగా మండిపడ్డారు. కాగా, ఆప్ ఆరోపణలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. సిసోదియాకు భద్రత కల్పించడంలో భాగంగానే పోలీసులు అలా ప్రవర్తించారని, నిందితులు మీడియాకు స్టేట్‌మెంట్లు ఇవ్వడం చట్టపరంగా వ్యతిరేకమని ఢిల్లీ పోలీస్ విభాగం ట్వీట్ చేసింది. మరోవైపు, మద్యం కుంభకోణం కేసులో సిసోదియా కస్టడీని కోర్టు మరోసారి పొడిగించింది. జూన్ 1వ తేదీ వరకు ఆయన జ్యుడీషియల్ కస్టడీలోనే ఉండాలని స్పష్టం చేసింది. అయితే జైల్లో ఆయనకు కుర్చీ, టేబుల్, పుస్తకాలు అందించాలని జైలు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది.

ఆప్ నాయకుడు సంజయ్‌సింగ్ మాట్లాడుతూ తమ బాస్‌ను ప్రసన్నం చేసుకునేందుకు సిసోదియా పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ ఘటనను కోర్టు తీవ్రంగా పరిగణించాలని కోరారు. పోలీసుల గూండాయిజానికి అంతులేకుండా పోయిందని, తన బాస్‌ను మెప్పించడానికి ఆ పోలీసు అధికారి సిసోదియా మెడ పట్టుకొని లాక్కెళ్లారని, మోదీ నియంతృత్వాన్ని దేశమంతా చూస్తోందని సంజయ్‌సింగ్ ట్వీట్ చేశారు. సిసోడియా పట్ల పోలీసులు ఇంత దారుణంగా ప్రవర్తించడాన్ని దేశం మర్చిపోదని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ అన్నారు. సిసోదియాను కోర్టుకు తీసుకెళ్లేటప్పుడు అవమానించాలని పోలీసులకు ఆదేశాలు వచ్చాయని ఆరోపించారు. జైలులోనే సిసోదియాను అధికారులు అవమానిస్తున్నారని తాము పదేపదే చెబుతున్నామని, దురదృష్టవశాత్తు దీనిని నిరూపించడానికి తమ వద్ద ఆధారాలు లేవన్నారు. కోర్టులోనే సిసోదియాను అవమానించాలని పోలీసులకు ఆదేశాలున్నాయన్నారు.

బక్కచిక్కిన జైన్

మనీలాండరింగ్ కేసులో అరెస్టయి తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ మాజీమంత్రి సత్యేందర్ జైన్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆయన్ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన ఫొటో ఒకటి బయటికొచ్చింది. అందులో జైన్ బలహీనంగా, బక్కచిక్కి కన్పించారు. ఈ ఫొటోను షేర్ చేసిన కేజ్రీవాల్... తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'జైన్ త్వరగా కోలుకోవాలని, బీజేపీ అహంకారాన్ని, దౌర్జన్యాలను ఢిల్లీ ప్రజలంతా చూస్తున్నారని పేర్కొన్నారు. ఈ అణచివేతదారులను దేవుడు కూడా క్షమించడని, ఈ పోరాటంలో తమకు ప్రజలు, భగవంతుడు అండగా ఉన్నారని తెలిపారు. తాము భగత్‌సింగ్ అనుచరులమని, అన్యాయం, నియంతృత్వంపై తమ పోరాటం కొనసాగుతోందని కేజ్రీవాల్ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. సత్యేందర్ జైన్‌ను జైల్లోనే చంపడానికి బీజేపీ కుట్రలు పన్నుతోందని ఆప్ నేతలు ఆరోపించారు.

బాలికలకు యుక్త వయసులో తల్లి సంరక్షణ అవసరం

ఇండోర్: ఆడపిల్లలు యుక్త వయసుకు చేరుకునే సమయంలో తల్లి సంరక్షణలో ఉండటం శ్రేయస్కరం... తద్వారా ఆమె భావాలు, భావోద్వేగాలు మెరుగ్గా నిర్వహించబడతాయని ఓ కుటుంబ న్యాయస్థానం స్పష్టం చేసింది. విడాకులు తీసుకున్న దంపతులకు సంబంధించిన కేసులో 10 ఏళ్ల బాలికకు కస్టడీని మంజూరు చేస్తూ మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లోని ఓ కుటుంబ న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. కుటుంబ న్యాయస్థానం అదనపు ప్రధాన న్యాయమూర్తి ప్రవీణా వ్యాస్, ఏప్రిల్ 25న జారీ చేసిన ఒక ఉత్తర్వులో... బాలిక యుక్తవయసు వైపు వెళుతోందని, అటువంటి పరిస్థితిలో, ఆమె అన్ని విధాలుగా తల్లి సంరక్షణలో ఉండటమే ఆమెకు మంచిదని అభిప్రాయపడ్డారు. బాలిక తండ్రి వారాంతాల్లో, ప్రత్యేక పండుగలు, వేసవి సెలవుల్లో నిర్ణీత వ్యవధిలో ఆమె తల్లి సమ్మతితో బాలికను కలుసుకోవచ్చని కోర్టు తెలిపిందని 46 ఏళ్ల మహిళ తరపు న్యాయవాది జితేంద్ర పురోహిత్ తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వ గెజిటెడ్ అధికారులని, వారు 2021లో విడాకులు తీసుకున్నారని చెప్పారు. దంపతులు విడిపోయిన తర్వాత బాలిక తన తండ్రితో కలిసి నివసిస్తోంది. కాగా కుమార్తెను తన కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఆ మహిళ 2019లో ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన కుమార్తె మానసికంగా, శారీరకంగా మార్పుచెందే వయసులోకి అడుగు పెడుతున్నందున ఆమెకు మార్గనిర్దేశం చేయగల తల్లిలాంటి మహిళ తోడు అవసరమని ఆ మహిళ పేర్కొంది.

విదేశీ ప్రతినిధులకు ఘన స్వాగతం

డెహ్రాడూన్: జీ20 సమావేశంలో పాల్గొనేందుకు విదేశీ ప్రతినిధుల బృందం మంగళవారం డెహ్రాడూన్ జాలీ గ్రాంట్ విమానాశ్రయానికి చేరుకుంది. వారికి స్థానిక కళాకారులు ఘన స్వాగతం పలికారు. సాంప్రదాయరీతిలో జానపద నృత్యం (చోలియా) చేస్తూ... అతిథులకు పూలమాలలు వేసి, తిలకం దిద్ది సాదరంగా ఆహ్వానించారు. కళాకారులతో పాటు కొంతమంది విదేశీ ప్రతినిధులు కూడా నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. మే 24, 25 తేదీల్లో ఇక్కడి నరేంద్ర నగర్‌లో జీ20 సదస్సు జరగనుంది. జీ20 సమావేశానికి ఉత్తరాఖండ్ ఆతిథ్యమివ్వడం ఇది రెండోసారి. అవినీతికి వ్యతిరేకంగా అంతర్జాతీయంగా వ్యవస్థను అభివృద్ధి పర్చి, దాన్ని బలోపేతం చేయడంపై ఈ సమావేశంలో చర్చ జరగనుంది. విదేశీ ప్రతినిధులకు ఉత్తరాఖండ్ ప్రత్యేకత, సంస్కృతిని పరిచయం చేయడానికి రాబోయే రెండు రోజుల్లో అనేక కార్యక్రమాలను రూపొందించారు. బుధవారం రిషికేశ్‌లోని నది ఒడ్డున జరిగే గంగా హారతికి విదేశీ ప్రతినిధులు హాజరవుతారు. ఉత్తరాఖండ్‌లోని కొండల్లోని గ్రామీణ జీవితాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు నరేంద్ర నగర్ సమీపంలోని ఓని గ్రామానికి కూడా వారిని తీసుకువెళతారు. రిషికేశ్ నుండి 14 కి.మీ దూరంలో ఉన్న ఓనిని రూ.10 కోట్ల వ్యయంతో ఒక నమూనా గ్రామంగా అభివృద్ధి చేశారు.

విధి నిర్వహణలో అగ్నిమాపక ఉద్యోగి మృతి

తిరువనంతపురం: ఇక్కడి ప్రభుత్వ డ్రగ్ గోదాములో చెలరేగిన భారీ మంటలను ఆర్పే ప్రయత్నంలో ప్రమాద వశాత్తు 32 ఏళ్ల అగ్నిమాపక ఉద్యోగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు రంజిత్... రాష్ట్ర అగ్నిమాపక, సహాయ సర్వీసెస్‌లోని చక్కా యూనిట్‌లో పనిచేస్తున్నారు. తుంబ సమీపంలోని కిన్‌ఫ్రా ఇండస్ట్రియల్ పార్క్‌లోని ఒక గోదాములో మంటలు చెలరేగాయని తెలిసినవెంటనే రంజిత్ సహోతోటి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మంటలను ఆర్పే పనిలో ఉండగా... అగ్నిప్రమాదానికి గురైన భవనంలోని ఒక భాగం కూలి రంజిత్‌పై పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతను మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేరళ మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేఎంఎస్‌సిఎల్)కి చెందిన డ్రగ్ గోదాము తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో మంటల్లో కాలిపోయింది.

రాహుల్ ఉంటే వాయనాడ్‌కు అమేథి గతే

స్మృతి ఇరానీ విమర్శ

తిరువనంతపురం: కేరళలోని వయనాడ్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఎంపీగా ఇప్పటివరకు ఉంటే ఆ స్థానానికి అమేథి గతే పట్టేదని కేంద్రమంత్రి స్మృతి ఇరానీ విమర్శించారు. తిరువనంతపురంలో భారతీయ మజ్దూర్ సంఘ్ నిర్వహించి రాష్ట్రస్థాయి మహిళా కార్మిక సదస్సు ప్రారంభోత్సవంలో ఆమె మాట్లాడుతూ రాహుల్‌పై విమర్శలు గుప్పించారు. రాహుల్ అమేథి ఎంపీగా ఉన్నప్పుడు అక్కడి 80శాతం మందికి విద్యుత్ సరఫరా లేదు. ఆ ప్రాంతానికి జిల్లా కలెక్టరేట్ లేదు. వైద్య కళాశాల, కేంద్రీయ విద్యాలయం, సైనిక పాఠశాల, జిల్లాస్థాయి ఆసుపత్రి వంటి సదుపాయాలు లేవు. ఆయన నిష్క్రమించిన తర్వాత అమేథి అభివృద్ధి చెందింది. అన్ని వసతులు వచ్చాయి. రాహుల్ ఉండివుంటే వయనాడ్‌కూ అమేథి గతే పట్టేది' అని స్మృతి ఇరానీ వ్యాఖ్యానించారు. పరువు నష్టం కేసులో రాహుల్‌కు శిక్ష పడిన క్రమంలో ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని, ఎంపీ హోదాను కోల్పోయిన విషయం విదితమే.

చౌహాన్ సర్కార్ తీర్థయాత్ర పథకం

విమానంలో షిర్డీకి 32 మంది వృద్ధులు

ఇండోర్ : మధ్యప్రదేశ్‌లో సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఉచిత తీర్థయాత్ర పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 32 మంది సీనియర్ సిటిజన్‌లు మంగళవారం ఇండోర్ నుంచి మహారాష్ట్రలోని షిర్డీకి విమానంలో బయలుదేరారని అధికారి ఒకరు తెలిపారు. ముఖ్యమంత్రి తీర్థ దర్శన్ యోజన కింద విమానంలో ప్రయాణించే లబ్ధిదారులలో ఇది రెండవ బ్యాచ్. 32 మంది సీనియర్ సిటిజన్లతో కూడిన మొదటి బ్యాచ్ రాష్ట్ర రాజధాని భోపాల్ నుంచి ఆదివారం ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరింది. మంగళవారం, సాధారణ విమానంలో ప్రభుత్వ ఖర్చుతో విమానంలో ప్రయాణించిన 32 మంది సీనియర్ సిటిజన్లలో అగర్-మాల్వా జిల్లాకు చెందిన 65 నుంచి 76 సంవత్సరాల వయస్సు గల వారు ఉన్నారు. ముఖ్యమంత్రి చౌహాన్ యాత్రికులు బయలుదేరే ముందు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా వారిని ఉద్దేశించి శుభాకాంక్షలు తెలిపారు. 'హవాయి-చప్పల్స్ (ఫ్లిప్-ఫ్లాప్స్) ధరించిన వ్యక్తి కూడా హవాయి-జహాజ్ (విమానం)లో ప్రయాణించడానికి అర్హుడని ప్రధాని నరేంద్ర మోదీ నమ్ముతున్నారు. ఇంతకు ముందు రాష్ట్రంలోని వృద్ధులను రైళ్లలో యాత్రకు పంపేవాళ్లం. ఇప్పుడు మేము వాటిని వివిధ యాత్రా స్థలాలకు విమానంలో పంపుతున్నాము' అని ఆయన చెప్పారు. కమల్ నాథ్ నేతృత్వంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి తీర్థ దర్శన్ యోజనను నిలిపివేసిందని, దానిని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం పునరుద్ధరించిందని సీఎం అన్నారు. ఈ పథకం కింద తీర్థయాత్ర కోసం సీనియర్ సిటిజన్లకు ఉచిత విమాన ప్రయాణ సౌకర్యాన్ని అందించిన దేశంలోనే మొదటి రాష్ట్రం మధ్యప్రదేశ్ అని ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు.

రష్యా వజ్రాలపై జీ7 కొత్త ఆంక్షలు

భారత్‌లో పది లక్షల ఉద్యోగాలకు దెబ్బ

గుజరాత్‌లోని సూరత్ వర్కర్లపై అధిక ప్రభావం

న్యూఢిల్లీ: హిరోషిమాలో ఇటీవల ముగిసిన జీ7 శిఖరాగ్ర సదస్సు కీలక నిర్ణయం తీసుకుంది. రష్యా నుంచి ఎగుమతయ్యే వజ్రాలను కట్టడి చేసే విధంగా కొత్త ఆంక్షలను తీసుకువస్తూ సదస్సు తీర్మానించింది. రష్యా గనుల నుంచి వచ్చే వజ్రాలపై ఆంక్షలు విధించింది. దీంతో భారత్‌లో ముఖ్యంగా గుజరాత్, సూరత్‌లోని వజ్రాల కార్మికులపై ప్రభావం ఎక్కువగా ఉండబోతోంది. దాదాపు పది లక్షల ఉద్యోగాలకు గండి కొట్టినట్లు అవుతుంది. తాజా పరిణామంపై జెమ్ & జువలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) ఛైర్మన్ విపుల్ షా, గుజరాత్‌లోని వజ్ర కార్మికుల సంఘం అధ్యక్షుడు రమేశ్‌భాయి జీలీరియా స్పందించారు. కొత్త ఆంక్షలు కొనసాగితే పది లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని, ఈ పరిశ్రమ కుదేలవుతుందన్నారు.

జీ7 సదస్సుకు భారత ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యారు. ఆయనతో పాటు అతిథులుగా సదస్సుకు హాజరైన వారిలో కుక్ దీవులు, వియత్నాం, ఇండోనేసియా, బ్రెజిల్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా దేశాలు ఉన్నాయి. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని అడ్డుకునేందుకు హైటెక్ పద్ధతుల వినియోగంలో భాగంగా నాలుగు బిలియన్ల డాలర్ల నుంచి ఐదు బిలియన్ల డాలర్లు విలువ చేసే రష్యా వజ్రాల వాణిజ్యాన్ని కట్టడి చేయాలని జీ7 సదస్సు నిర్ణయించింది. తాజా ఆంక్షలతో రష్యా నుంచి ముడి వజ్రాలు అందుబాటులో ఉండకపోవడం వల్ల సూరత్‌లోని వజ్రాల కార్మికులకు పని లభించని పరిస్థితి ఏర్పడింది. యుద్ధం కారణంగా ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ఏర్పడితే ఈ సంక్షోభం మరింత తీవ్రతరమవుతుంది. ప్రపంచంలో లభ్యమయ్యే పది రకాల వజ్రాల్లో తొమ్మిది కటింగ్, పాలిషింగ్ భారత్‌లో జరుగుతుంది. అల్‌రోజా నుంచి రష్యా వజ్రాలను దిగుమతి చేసుకుంటుంది. అంతర్జాతీయ ముడి వజ్రాల దిగుబడిలో ఇది 30శాతంగా ఉంది. ఏ వజ్రం ఎక్కడ నుంచి వచ్చిందనేది గుర్తించేందుకు కచ్చితమైన పద్ధతి ఏమీ లేదు. దీంతో ప్రపంచ మార్కెట్లలో రష్యా వజ్రాలను తగ్గించేందుకు వాటిని గుర్తించే సాంకేతికతలను జీ7 అన్వేషిస్తోంది. వజ్రాల ఎగుమతుల నుంచి రష్యాకు వచ్చే ఆదాయాన్ని తగ్గించేందుకు, అక్కడి వజ్రాల వినియోగం, వర్తకాన్ని అడ్డుకునేందుకు కలిసి పనిచేస్తున్నాం' అని జీ7 ప్రకటన పేర్కొంది.

కేజ్రీవాల్, సంజయ్ సింగ్‌కు తాజా సమన్లు

పరువు నష్టం కేసులో గుజరాత్ కోర్టు

అహ్మదాబాద్ : ప్రధాని నరేంద్ర మోదీ అకడమిక్ డిగ్రీపై గుజరాత్ విశ్వవిద్యాలయం దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో జూన్ 7న విచారణకు హాజరు కావాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌కు మంగళవారం గుజరాత్‌లోని కోర్టు తాజాగా సమన్లు జారీ చేసింది. వీరిద్దరినీ మే 23న హాజరుకావాలని గతంలో జారీ చేసిన సమన్లు ఎవరూ కోర్టుకు హాజరు కానందున వారికి అందినట్లు కనిపించడం లేదని కోర్టుకు తెలియజేయడంతో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎస్.జె.పంచల్ కోర్టు కేజ్రీవాల్, సింగ్‌కు సమన్లు జారీ చేసింది. అంతకుముందు, ప్రధాని నరేంద్ర మోదీ అకడమిక్ డిగ్రీపై గుజరాత్ విశ్వవిద్యాలయానికి వ్యతిరేకంగా వారి 'వ్యంగ', 'అవమానకరమైన' ప్రకటనల కోసం క్రిమినల్ పరువు నష్టం ఫిర్యాదులో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జయేష్ చోవాటియా కోర్టు ఆప్ నాయకులకు సమన్లు జారీ చేసింది. గుజరాత్‌కు చెందిన ఆప్ న్యాయ సలహా అధ్యక్షుడు ప్రణవ్ ఠక్కర్ సోమవారం మాట్లాడుతూ కేజ్రీవాల్, సింగ్‌కు కోర్టు జారీ చేసిన సమన్లు ఇంకా అందలేదని అన్నారు. మంగళవారం, గుజరాత్ విశ్వవిద్యాలయం న్యాయవాది అమిత్ నాయర్ కొత్త న్యాయమూర్తి ఎస్.జె.పంచల్ కేసు గురించి వివరించారు. మునుపటి న్యాయమూర్తి మే 23న హాజరుకావాలని నిందితులపై ఏప్రిల్ 15న ప్రక్రియను జారీ చేశారని చెప్పారు. ఇచ్చిన తేదీకి ఎవరూ హాజరు కానందున, వారికి సమన్లు అందజేశారా లేదా అన్నది స్పష్టంగా తెలియలేదని అన్నారు. తనిఖీ చేయాలని సిబ్బందిని కోరిన న్యాయమూర్తి, కేజ్రీవాల్, సింగ్‌కు సమన్లు జారీ చేయాలని ఆదేశించారు. గుజరాత్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పీయూష్ పటేల్ దాఖలు చేసిన ఫిర్యాదుపై భారత శిక్షాస్మృతి (ఐపీసీ) లోని సెక్షన్ 500 కింద కేజ్రీవాల్, సింగ్‌పై కేసు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించిన తర్వాత మునుపటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జయేష్ చోవాటియా ఏప్రిల్ 15న సమన్లు జారీ చేశారు.

ఐటీఆర్ 1,4 దాఖలుకు 'ఆన్‌లైన్ మోడ్'

న్యూఢిల్లీ: వ్యక్తులు, వృత్తి నిపుణులు, చిన్న వ్యాపారులు 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్న్‌లు (ఐటీఆర్) 1, 4లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయడాన్ని ఆదాయపు పన్ను శాఖ ప్రారంభించింది. ఇతర ఐటీఆర్‌లు/ఫారమ్‌లను సిద్ధం చేయడానికి సాఫ్ట్‌వేర్/యుటిలిటీలు త్వరలో ప్రారంభించబడతాయని ఆదాయపు పన్ను శాఖ ఒక ట్వీట్‌లో తెలిపింది. 'ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో 2023-24కు ఐటీఆర్-1, 4 దాఖలు' ప్రారంభమైందని ఆదాయపన్ను శాఖ... ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపింది. తమ ఖాతాలను ఆడిట్ చేయాల్సిన అవసరం లేని వ్యక్తులు 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడానికి చివరి తేదీ జులై 31. ఐటీఆర్-1 వేతన తరగతి, సీనియర్ సిటిజన్లు సహా వ్యక్తులు దాఖలు చేస్తారు. సంభావ్య పన్ను విధానిన్ని ఎంచుకున్న వ్యాపారులు, వృత్తిదారులు, వార్షిక ఆదాయం రూ. 50 లక్షలకు మించని వ్యక్తులు ఐటీఆర్-2 దాఖలు చేస్తారు.

నీరజ్ చోప్రాకు ఖడ్గే అభినందన

న్యూఢిల్లీ: పురుషుల జావెలిన్ త్రో ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన ఒలింపియన్ నీరజ్ చోప్రాను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే మంగళవారం అభినందించారు. ప్రతి భారతీయుడు అతని విజయానికి గర్వపడుతున్నారన్నారు. చోప్రా కఠోర శ్రమ, పట్టుదల ఈ ఘనతను సాధించడంలో అతనికి సహాయపడిందని కూడా ఖడ్గే పేర్కొన్నారు. 'పురుషుల జావెలిన్ త్రో విభాగంలో ప్రపంచ నంబర్ 1 ర్యాంక్ సాధించినందుకు నీరజ్ చోప్రాకు అభినందనలు. మీ అసాధారణ విజయానికి ప్రతి భారతీయుడు గర్విస్తున్నాడు! భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు' అని ఖడ్గే ట్వీట్ చేశారు. ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య తాజాగా విడుదల చేసిన పురుషుల జావెలిన్ త్రో ర్యాంకింగ్స్‌లో చోప్రా తన కెరీర్‌లో తొలిసారిగా ప్రపంచ నంబర్ వన్ ర్యాంకులో నిలిచాడు.

పోబిటోరా వన్యప్రాణుల అభయారణ్యంపై

కేంద్రం, అసోంకు సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ : పోబిటోరా వన్యప్రాణుల అభయారణ్యం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని పర్యావరణ సున్నిత ప్రాంతంగా ప్రకటించాలని, అన్ని ఆక్రమణలను తొలగించాలని కోరుతూ దాఖలయిన పిటిషన్‌పై స్పందించాలని కేంద్రం, అసోం ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. వన్యప్రాణుల అభయారణ్యంపై న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్, విక్రమ్ నాథ్, సంజయ్ కరోల్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 'నోటీసు జారీ జులై 12, 2023న తిరిగి ఇవ్వబడుతుంది. అసోం రాష్ట్రానికి సంబంధించి స్టాండింగ్ కౌన్సెల్‌కు సేవ చేసే స్వేచ్ఛ మంజూరయింది' అని ధర్మాసనం పేర్కొంది. పోబిటోరా వన్యప్రాణుల అభయారణ్యం సరిహద్దును మరింత ఆలస్యం చేయకుండా కచ్చితంగా గుర్తించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పర్యావరణ కార్యకర్త రోహిత్ చౌదరి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద 1998లో నోటిఫై చేసిన అభయారణ్యం సరిహద్దును ఇంకా కచ్చితంగా గుర్తించాల్సి ఉందని, అభయారణ్యం ప్రాంతంలోని కొంత భాగమైన ఖాస్ భూమి (ప్రభుత్వ నియంత్రిత భూమి) నియంత్రణను జిల్లా యంత్రాంగం ద్వారా అటవీ శాఖకు ఇంకా అప్పగించాల్సి ఉందని పిటిషన్ వాదించింది. డిసెంబరు 11, 2018 నాటి సుప్రీం కోర్టు ఆదేశాలను నిర్ద్వంద్వంగా బేఖాతరు చేస్తూ అభయారణ్యం చుట్టుపక్కల ప్రాంతాన్ని పర్యావరణ సున్నిత ప్రాంతం (ఇఎస్‌జెడ్) గా ప్రకటించడానికి అధికారులు ఎటువంటి ప్రభావవంతమైన చర్యలు తీసుకోలేదని పిటిషన్ ఆరోపించింది. 'ఇరవై అయిదేళ్లు గడిచినా, పోబిటోరా అభయారణ్యం సరిహద్దు ఇంకా భౌతికంగా గుర్తించబడలేదు' అని పేర్కొంది. ఇరవై ఐదు సంవత్సరాలు గడిచినప్పటికీ, వివిధ అటవీ అధికారులతో పాటు మోరిగావ్ జిల్లా డిప్యూటీ కమిషనర్‌కు మధ్య జరిగిన లేఖల పరంపర ద్వారా ఈ విషయం స్పష్టమవుతుందని తెలిపింది. 'మార్చి 17, 1998 నాటి నోటిఫికేషన్ ప్రకారం పోబిటోరా వన్యప్రాణుల అభయారణ్యం సరిహద్దును మరింత ఆలస్యం చేయకుండా కచ్చితంగా గుర్తించమని ప్రతివాదులను ఆదేశించండి' అని అభ్యర్థించింది.

కర్నాటక అసెంబ్లీ స్పీకర్ పదవికి కాంగ్రెస్ నేత ఖాదర్ నామినేషన్



బెంగళూరు : కర్నాటక శాసనసభ స్పీకర్ పదవికి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన యుటి ఖాదర్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రి బి.జె.జమీర్ అహ్మద్ ఖాన్, ఇతర కాంగ్రెస్ నేతల సమక్షంలో మంగళూరు అసెంబ్లీ సెగ్మెంట్ ఎమ్మెల్యే ఖాదర్ అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. సంప్రదాయం ప్రకారం, అధికార పార్టీ అభ్యర్థిని సాధారణంగా స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటారు. ఖాదర్ ఎన్నికయితే కర్నాటక అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన తొలి ముస్లిం నేత అవుతారు. ఖాదర్ గత అసెంబ్లీలో ప్రతిపక్ష ఉప నేతగా, అలాగే మంత్రిగా కూడా పని చేశారు.

విదేశాల్లో సేంద్రియ సాగు అభ్యసనం

బీహార్‌లోని 13 జిల్లాల నుంచి రైతులు

పాట్నా : వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడానికి సేంద్రియ సాగులో అధునాతన పద్ధతులను నేర్చుకోవడానికి 13 జిల్లాల రైతులను విదేశాలకు పంపాలని బీహార్ ప్రభుత్వం నిర్ణయించింది. గంగా తీరం వెంబడి ఉన్న 13 జిల్లాల ఆసక్తిగల రైతులను బ్యాచ్‌ల వారీగా విదేశాలకు పంపిస్తామని, ఒక్కో సాగుదారునికి రూ.5 లక్షల ఖర్చును రాష్ట్ర వ్యవసాయ శాఖ భరిస్తుందని బీహార్ వ్యవసాయ శాఖ మంత్రి కుమార్ సర్వజీత్ తెలిపారు. 'వ్యవసాయ శాఖ ఇప్పటికే రాష్ట్రంలోని 13 జిల్లాల (గంగా తీరం వెంబడి) ఆర్గానిక్ ఫార్మింగ్ కారిడార్‌ను రూపొందించింది. ఇక్కడ రైతులు తమ ప్రాంతాల్లో సేంద్రియ సాగును ఎంచుకోవడానికి ప్రోత్సహిస్తారు. ఇది మిషన్ మోడ్‌లో చేయబడుతుంది. ఆసక్తిగల రైతులకు 2025 వరకు రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయానికి సంబంధించిన అన్ని సౌకర్యాలను అందిస్తుంది' అని ఆయన అన్నారు. 'మేము ఈ 13 జిల్లాల ఆసక్తిగల రైతులను వియత్నాం, థాయ్‌లాండ్, భూటాన్ మొదలైన దేశాలకు సేంద్రియ వ్యవసాయంలో అధునాతన పద్ధతులను నేర్చుకోవడానికి పంపుతాము. నేర్చుకున్న తర్వాత, వారు పద్ధతులను అవలంబిస్తారు. మెరుగైన ఉత్పాదకత కోసం సేంద్రియ వ్యవసాయం మెళుకువలను వారి తోటి రైతులకు తెలియజేస్తారు' అని మంత్రి పీటీఐకి వివరించారు. వియత్నాం, థాయ్‌లాండ్, భూటాన్‌లలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు బాగా రాణిస్తున్నారని చెప్పారు. 'మా రైతుల విదేశీ అభ్యాసం/అధ్యయన పర్యటనల ఖర్చులను మేము భరిస్తాము. ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమయింది. శాఖ ఇప్పటికే దాదాపు రాష్ట్రంలో ఆర్గానిక్ ఫార్మింగ్ కారిడార్‌ను సమర్థవంతంగా అభివృద్ధి చేసేందుకు రూ.104.36 కోట్లు కేటాయించింది' అని మంత్రి తెలిపారు. కారిడార్‌ను రూపొందించేందుకు 13 జిల్లాల్లో 20 వేల ఎకరాలను గుర్తించామన్నారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను మంత్రి వివరిస్తూ, ఈ వ్యవసాయ విధానంలో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా పర్యావరణ, సామాజిక బాధ్యతతో ఉత్పత్తులను పండిస్తారని, సేంద్రియ వ్యవసాయానికి తక్కువ పెట్టుబడే అవసరమవుతుందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద సాగుదారులకు వ్యవసాయ గ్రాంట్లు, సేంద్రియ వ్యవసాయం కోసం ఉచిత ధ్రువీకరణ పత్రం అందజేస్తామని చెప్పారు. దీంతో పాటు రైతులకు అధిక ఆదాయం వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, పథకాలు, కొత్త విధానాలను అమలు చేయాలని యోచిస్తోంది. రాష్ట్రంలోని రైతుల వ్యవసాయ లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా నితీశ్ కుమార్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 4వ వ్యవసాయ రోడ్‌మ్యాప్‌లో ఈ చొరవ భాగం. ఆర్గానిక్ కారిడార్‌లో భాగమైన 13 జిల్లాలు పాట్నా, బక్సర్, భోజ్‌పూర్, నలంద, లఖిసరాయ్, వైశాలి, సరన్, సమస్తిపూర్, ఖగారియా, బెగుసరాయ్, భాగల్పూర్, ముంగేర్, కతిహార్ ఉన్నాయి. పాట్నా, భోజ్‌పూర్, నలంద, వైశాలి, సరన్, సమస్తిపూర్, బెగుసరాయ్‌లో ప్రతి ఏడు జిల్లాల్లో కారిడార్‌ను రూపొందించడానికి 2 వేల ఎకరాలను వ్యవసాయ శాఖ గుర్తించింది.

మన బంధానికి గౌరవం, విశ్వాసమే మూలం

- ఆస్ట్రేలియా 'లిటిల్ ఇండియా'లో ప్రధాని మోదీ
- బ్రిస్బేన్‌లో దౌత్యకార్యాలయం ఏర్పాటు ప్రకటన

సిడ్నీ: గౌరవం, విశ్వాసమే భారత్, ఆస్ట్రేలియా బంధానికి మూలాధారం అని ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం 'లిటిల్ ఇండియా' కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనియో అల్బనీస్‌తో కలిసి పాల్గొన్నారు. భారత సంతతి ఆస్ట్రేలియన్లను ఉద్దేశించి మాట్లాడుతూ, రెండు దేశాలు వ్యూహాత్మక భాగస్వాములని చెప్పారు. భారత సంతతి ప్రజల దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారానికి బ్రిస్బేన్‌లో దౌత్య కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం రాగల ఐదేళ్లలో రెట్టింపు కాబోతోందని మోదీ చెప్పారు. గతేడాది జరిగిన ఆర్థిక సహకారం, వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావించారు. సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం దిశగా కసరత్తు జరుగుతోందని అన్నారు. స్వీయసమృద్ధి, నమ్మకమైన సరఫరా గొలుసులను ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలిపారు. తద్వార రెండు దేశాల వాణిజ్యం పెరుగుతుందని, ప్రపంచానికి కొత్త విశ్వాసం లభిస్తుందని చెప్పారు. భారత్, ఆస్ట్రేలియా బంధం 3సీలు - కామన్‌వెల్త్, క్రికెట్, కర్రీ నుంచి 3 డీలు - డెమొక్రసీ, దయాస్పోరా, దోస్తీ, వరకు ఆపై 3 ఈలు- ఎనర్జీ, ఎకనామీ, ఎడ్యుకేషన్‌కు చేరుకున్నట్లు తెలిపారు. పరస్పర విశ్వాసం, గౌరవమే తమ బంధానికి మూలాధారమని 'మోదీ, మోదీ' నినాదాల నడుమ ప్రసంగించారు. 'కొన్ని తరాలుగా క్రికెట్ రెండు దేశాలను కలిపి ఉంచుతోంది. టెన్నిస్, సినిమాలు, యోగా, ప్రవాస భారతీయ వర్గం ఈ బంధాన్ని బలోపేతం చేస్తున్నాయ'ని మోదీ అన్నారు. హారిస్ పార్క్‌కు లిటిల్ ఇండియాగా పేరు పెట్టడాన్ని స్వాగతించారు. ఆస్ట్రేలియా ప్రధానికి భారతీయ రుచులను పరిచయం చేయాలని భారత సంతతి ప్రజలను కోరారు. లిటిల్ ఇండియాకు తీసుకెళ్లి అల్బనీస్‌కు చాట్, జిలేబి వంటివి తినిపించండని అన్నారు.

మోదీకి ఘనస్వాగతం-రాక్‌స్టార్‌తో పోల్చిన అల్బనీస్

ఆస్ట్రేలియాలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. ఇంతటి ఆదరణ ప్రముఖ గాయకులు బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్‌కూ లభించలేదని ఆస్ట్రేలియా ప్రధాని అన్నారు. 'మోదీ ఈజీ ది బాస్' అని కొనియాడారు. ఆయనకు రాక్‌స్టార్ తరహా ఆదరణ లభించిందంటూ అల్బనీస్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. 'చివరిసారిగా ఈ వేదికపై బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్‌ను చూశాను. ఆయనకు ఇంత స్పందన రాలేదు. 'మోదీ ఈజీ ది బాస్" అని పొగిడారు. భారత్‌ను ఓ శక్తిమంతమైన దేశంగా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దిక్సూచీగా అభివర్ణించారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యం స్ఫూర్తిని ఆస్ట్రేలియాకు తీసుకొచ్చినందుకు ప్రియ మిత్రుడు మోదీకి కృతజ్ఞతలు అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు తోడ్పాటు అందించారని చెప్పారు. భారత్ నిలకడగా ఎదుగుతోన్న ఆర్థిక వ్యవస్థ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద టాలెంట్ ఫ్యాక్టరీ ఉందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఐఎంఎఫ్ ఒక ఆశాకిరణంగా చూస్తోందని చెప్పారు. 'ఎలాంటి ఒడుదుడుకులనైనా తట్టుకునే దేశం భారత్ అని ప్రపంచబ్యాంకు చెప్పింది. అలాంటి సవాళ్లలో కూడా ఎగుమతులు రికార్డుస్థాయిలో పెరిగాయి. ప్రతి దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ ఇబ్బందుల్లో ఉంది. కానీ భారత బ్యాంకింగ్ వ్యవస్థకు అంతర్జాతీయంగా ప్రశంసలు వస్తున్నాయి' అని అల్బనీస్ వెల్లడించారు.

లిటిల్ ఇండియాకు శంకుస్థాపన

రెండు దేశాల మైత్రి, ప్రవాస భారతీయుల సహకారానికి గుర్తుగా ఇద్దరు అధినేతలు కలిసి ఆస్ట్రేలియాలో 'లిటిల్ ఇండియా'కు శంకుస్థాపన చేశారు. సిడ్నీలోని హారిస్ పార్క్‌కు లిటిల్ ఇండియాగా నామకరణం చేశారు. అక్కడ 'లిటిల్ ఇండియా' గేట్‌వేను నిర్మించనున్నారు. ఈ పార్క్ వద్ద భారతీయ సంతతి ప్రజలు దీపావళి, ఆస్ట్రేలియా డే వంటి వేడుకలను నిర్వహిస్తుంటారు.

ట్రక్కు డ్రైవర్ల సమస్యలు వింటూ...

దిల్లీ నుంచి చండీగఢ్‌కు రాహుల్ ట్రాక్టర్ ప్రయాణం

చండీగఢ్/న్యూదిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిత్యం ప్రజల్లో ఉండటానికి నిర్ణయం తీసుకున్నారు. భారత్ జోడో యాత్రతో ఇప్పటికే దేశవ్యాప్తంగా పాదయాత్ర చేసిన రాహుల్...ఆయా వర్గాల ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి వేర్వేరు రూపాల్లో ప్రయత్నం చేస్తున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీ సర్కారును గద్దె దించే లక్ష్యంతో ఆయన ప్రజల్లోకి దూసుకెళుతున్నారు. ఇప్పటికే ప్రతిపక్షాల ఐక్యత కోసం కృషి చేస్తూనే...ప్రజలకు దగ్గర కావడానికి అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా ట్రక్కు డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడానికి రాహుల్‌గాంధీ దిల్లీ నుంచి చండీగఢ్‌కు ట్రాక్టర్‌పై ప్రయాణించినట్లు కాంగ్రెస్ పార్టీ మంగళవారం వెల్లడించింది. సోమవారం రాత్రి రాహుల్ ట్రాక్టర్‌లో తన ప్రయాణం ప్రారంభించారు. డ్రైవర్ ట్రాక్టర్ నడుపుతుంటే రాహుల్ పక్కన కూర్చున్నారు. మార్గమధ్యంలో ధాబా వద్ద ఆగి డ్రైవర్ల సమస్యలు తెలుసుకున్నారు. ట్రక్కు డ్రైవర్ల సమస్యలు తెలుసుకోవడానికి ప్రజానాయకుడు రాహుల్ దిల్లీ నుంచి చండీగఢ్ వరకు ట్రాక్టర్‌లో ప్రయాణించారని కాంగ్రెస్ ట్వీట్ చేసింది. దీనికి సంబంధించిన వీడియోలు షేర్ చేసింది. మంగళవారం ఉదయం అంబాల-చండీగఢ్ జాతీయ రహదారి పక్కన గల అంబాలలోని గురుద్వార వద్ద ఆగి ఆయన ప్రార్థనలు చేశారు. 'భారతదేశంలో రోడ్లపై 90 లక్షల మంది ట్రక్కు డ్రైవర్లు తిరుగుతున్నారు. వారికి అనేక సమస్యలు ఉన్నాయి. వారి కష్టాలు తెలుసుకోవాలని రాహుల్ కోరుకున్నారు' అని కాంగ్రెస్ తెలిపింది. ట్రక్కు డ్రైవర్లతో కలిసి రాహుల్ ప్రయాణించారని, మార్గమధ్యలో ఆగి డ్రైవర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారని కాంగ్రెస్ పార్టీ హరియాణా రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ భాన్ పీటీఐకి చెప్పారు. రాహుల్ ట్రక్కు ప్రయాణం, డ్రైవర్లతో ముచ్చటిస్తున్న ఫొటోలను కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం షేర్ చేసింది.

మత వైరస్ సమాజానికి నష్టం: సిబల్



న్యూదిల్లీ: కరోనా వైరస్ మనుషుల శరీరంపై మాత్రమే ప్రభావం చూపతుందని, కానీ మత వైరస్ సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. మత వైరస్ వల్ల తాత్కాలిక రాజకీయ లబ్ధి పొందవచ్చని, కానీ శాశ్వతంగా భయోత్పాతం కల్పిస్తుందని ఆయన చెప్పారు. మణిపూర్‌లో తాజాగా చెలరేగిన హింసపై కపిల్ సిబల్ స్పందిస్తూ మంగళవారం ట్వీట్ చేశారు. 'మణిపూర్ మరోసారి మండుతోంది. ఇంతకుముందు జరిగిన అల్లర్లలో 70 మంది చనిపోయారు. 200 మంది గాయపడ్డారు. కరోనా వైరస్ శరీరానికే నష్టం...మత వైరస్ సమాజానికి నష్టం' అని సిబల్ ట్వీట్ చేశారు. 'మత వైరస్ విస్తరిస్తే...దాని పర్యవసానాలు ఊహించడానికే కష్టం. దాని రాజకీయ లబ్ధి అనేది తాత్కాలికం. దీనివల్ల సంభవించే భయం శాశ్వతం' అని కేంద్ర మాజీమంత్రి సిబల్ పేర్కొన్నారు. యూపీఏ-1, 2లో మంత్రిగా పనిచేసిన సిబల్ గతేడాది మేలో కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో ఆయన ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. అన్యాయంపై పోరాటానికిఅన్యాఫ్ అనే రాజకీయేతర సంస్థను సిబల్ ఇటీవల ఏర్పాటు చేశారు. మణిపూర్‌లో హింస నేపథ్యంలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వాలపై ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్న విషయం విదితమే. తాజాగా సోమవారం చెలరేగిన అల్లర్లలో ప్రాణహాని జరగలేదు.

ఆర్డినెన్స్‌పై పోరుకు మద్దతు

కేజ్రీవాల్‌తో భేటీలో మమత

కోల్‌కతా: దిల్లీలో అధికారాలకు సంబంధించి కేంద్రం తెచ్చిన కొత్త ఆర్డినెన్స్‌పై ఆమ్ ఆద్మీ ప్రభుత్వం (ఆప్) చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. ఆమె మంగళవారం రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో గంటకుపైగా భేటీ అయ్యారు. అనంతరం విలేకరులతో నాయకులు మాట్లాడారు. 'కేంద్ర ఆర్డినెన్స్‌పై పోరాటంలో ఆప్‌కు మద్దతిస్తున్నాం. బీజేపీకి వ్యతిరేకంగా ఓటేయాలని అన్ని పార్టీలను కోరుతున్నాం' అని మమతా బెనర్జీ అన్నారు. డబుల్ ఇంజిన్ ఇబ్బందిపెట్టే ఇంజిన్‌గా (కేంద్రం-రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం) ఉన్నదని వ్యాఖ్యానించారు. దిల్లీలో సేవలపై నియంత్రణకు సంబంధించి సెంట్రల్ ఆర్డినెన్స్ బిల్లును చట్టం చేసేందుకు త్వరలో రాజ్యసభలో జరగబోయే ఓటింగ్... 2024 ఎన్నికలకు సెమీ ఫైనలేనని ఆమె నొక్కిచెప్పారు.

బీజేపీయేతర పార్టీలకు ఇది అగ్నిపరీక్ష: కేజ్రీవాల్

కొత్త ఆర్డినెన్స్ ప్రకారం దిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి అధికారాలు ఉండవని, అవన్నీ కేంద్రప్రభుత్వ నియంతృత్వ కమిటీకి వెళ్లిపోతాయని ఆప్ కన్వీనర్ చెప్పారు. ఈ ఆర్డినెన్స్‌ను రాజ్యసభలో అడ్డుకోగలమని విపక్షాలు భావిస్తున్నాయని తెలిపారు. బీజేపీయేతర పార్టీలకు ఇది అగ్నిపరీక్ష అని దిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చివేసేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు, సీబీఐ, ఈడీ, గవర్నర్ ద్వారా కాషాయ పార్టీ యత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ అపహాస్యం చేస్తోందని, ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో ఏదో విధంగా బీజేపీయేతర ప్రభుత్వాలను కూల్చేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌తో కలిసి కేజ్రీవాల్ కోల్‌కతా చేరుకొని మమతను కలిసి తమ పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. బీజేపీపై పోరుకు కలిసిరావాలన్నారు. కేజ్రీవాల్ బుధవారం ముంబైలో శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌తోనూ భేటీ కానున్నారు.

మంత్రి మాటలపై దుమారం

- ఐదేళ్లు సిద్ధరామయ్యే సీఎం అంటూ పాటిల్ వ్యాఖ్యలు
- అధిష్ఠానం చూసుకుంటుందన్న డీకే

బెంగళూరు: కర్నాటకలో అధికారం చేపట్టి మూడు రోజులు కూడా గడవకముందే కాంగ్రెస్ పార్టీలో మంటలు చెలరేగాయి. ముఖ్యమంత్రి పదవిపై సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో కాంగ్రెస్ అధిష్ఠానం రెండు, మూడు రోజులు ఎడతెరిపిలేని చర్చలు జరిపి...చివరికి సీఎంగా సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు తీసుకునేలా ఒప్పించారు. అంతేకాకుండా అధికార పంపిణీ ఉంటుందని శివకుమార్‌కు నచ్చచెప్పింది. ఇదిలా ఉంటే...ఐదేళ్ల పూర్తి పదవీకాలం సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉంటారని సీనియర్ మంత్రి ఎంబీ పాటిల్ చేసిన వ్యాఖ్యలు పాలక పార్టీలో దుమారం రేపింది. రెండున్నరేళ్ల తర్వాత లేదా 2024 లోక్‌సభ ఎన్నికల అనంతరం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఊహాగానాలు వినిపిస్తున్నాయిగా అని విలేకరులు అడుగగా...అలాంటి చర్చలేమీ లేవని, సిద్ధరామయ్య ఐదేళ్లు సీఎంగా కొనసాగుతారని పాటిల్ సోమవారం చెప్పారు. మంత్రి పాటిల్ వ్యాఖ్యలపై శివకుమార్ నేరుగా స్పందించేందుకు నిరాకరించారు. ఈ విషయాన్ని అధిష్ఠానం చేసుకుంటుందని సుతిమెత్తగా చెప్పారు. అయితే, శివకుమార్ సోదరుడు, బెంగళూరు రూరల్ ఎంపీ డీకే సురేశ్ ఘాటుగా స్పందించారు. మంత్రి పాటిల్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఎంబీ పాటిల్ నిన్న మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ 'సిద్ధరామయ్య ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారు. అధికార పంపిణీ లేదా ఇంకేమైనా ఉంటే మా నాయకత్వం మీకు(మీడియా) చెబుతుంది. అలాంటిదేమీ జరగలేదు. మా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఏమి చెప్పారో అదే కొనసాగుతుంది' అని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేస్తారన్న వార్తలపై ప్రశ్నించగా అలాంటిదేమైనా ఉంటే తమ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి చెబుతారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రిగా శివకుమార్ పేర్లను ప్రకటించిన వెంటనే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విలేకరుల సమావేశంలో చెప్పిందే తాను ప్రస్తావించానని మంగళవారం కూడా పాటిల్ చెప్పారు. అధికార పంపిణీపై విలేకరులు వేణుగోపాల్‌ను అడిగితే 'అలాంటిదేమీ లేదు. ప్రజలతోనే మా అధికార పంపిణీ' అని చెప్పారని, తాను కూడా దానినే ఉటంకించానని పాటిల్ సమర్థించుకున్నారు.

పాటిల్ వ్యాఖ్యలపై స్పందించడానికి ఇష్టపడని శివకుమార్... 'ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడుకుంటారు. ఏది కోరుకుంటే అది చెబుతారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అక్కడ ఉన్నారు. ముఖ్యమంత్రి, ఏఐసీసీ అధ్యక్షుడు అక్కడ ఉన్నారు' అని చెప్పారు. కాగా పాటిల్ వ్యాఖ్యలపై డీకే సురేశ్ తీవ్రంగా స్పందించారు. 'ముఖ్యమంత్రి సిద్ధరామయ్య. మీకు ఇంకా అదనపు సమాచారం కావాలన్నా...ఎంబీ పాటిల్ వ్యాఖ్యలకు సమాధానం కావాలన్నా...మీరు మా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్ సూర్జేవాలాను కలవండి. వాస్తవాలు తెలుసుకోండి. నేను కూడా గట్టిగానూ, తీవ్రంగానూ మాట్లాడగలను. కానీ అలా చేయను' అని డీకే సురేశ్ అన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ 'స్కాట్ దొర' మృతికి రాజమౌళి సంతాపం



హైదరాబాద్: 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలో స్కాట్ దొరగా నటించి అందరి ప్రశంసలు పొందిన రే స్టీవెన్‌సన్ హఠాన్మరణం చెందడంపై దర్శకుడు రాజమౌళి దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. 'షాకింగ్... ఈ వార్తను నేను నమ్మలేకున్నాను. షూటింగ్ సెట్స్ లో రే ఎంతో ఎనర్జీని, చైతన్యాన్ని తీసుకొచ్చేవాడు. ఆయనతో కలసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉండేది. ఆయన కుటుంబం కోసం నేను ప్రార్థిస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి' అంటూ ట్వీట్ చేశారు. రే మరణంపై జూనియర్ ఎన్టీఆర్ కూడా స్పందించాడు. రే స్టీవెన్‌సన్ మరణ వార్త షాక్ కు గురిచేస్తోంది. చాలా త్వరగా వెళ్లిపోయారు. ఆయనతో కలసి నటించడం గొప్ప అనుభవం. ఆయన ఆత్మకు శాంతి కలగాలి. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబం కోసం నా ప్రార్థనలు అంటూ ట్వీట్ చేశాడు. రే స్టీవెన్‌సన్ మృతికి తీవ్రమైన అనారోగ్యం కారణమని ఇటాలియన్ వార్తా పత్రిక రిపబ్లికా వెల్లడించింది. ఇటలీలో ఇస్చియా ద్వీపకల్పంలో క్యాసినో అనే చిత్రాన్ని చిత్రీకరిస్తుండగా రే అస్వస్థతకు గురయ్యారు. దీంతో రేను వెంటనే స్థానిక ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. అయినప్పటి ఫలితం లేకపోయిందని తెలిపింది.



దిల్లీలో రెజ్లర్ల కొవ్వొత్తుల ప్రదర్శన

బ్రిజ్ భూషణ్ అరెస్టుకు డిమాండ్

న్యూదిల్లీ: మైనర్‌తో సహా యువ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, అలాగే సమాఖ్య అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భారత అగ్రశ్రేణి మహిళా రెజ్లర్ల నేతృత్వంలోని వందల మంది నిరసనకారులు మంగళవారం దేశ రాజధాని నగరంలో భారీ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను చేతపట్టుకుని నిరసనకారులు పార్లమెంటు భవనానికి సమీపంలోని ఇండియా గేట్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా భారీ పోలీసు బందోస్తు ఏర్పాటు చేశారు. తీవ్ర వేడిగాలులు వీస్తున్నప్పటికీ దాదాపు నెల రోజులుగా రెజ్లర్లు నిరసనలు కొనసాగిస్తున్నారు. రెజ్లర్లు తమ శిక్షణా షెడ్యూల్‌ను కూడా నిలిపివేశారు. ముఖ్యంగా ఇద్దరు ఒలింపిక్ పతక విజేతలు బజరంగ్ పునియా, సాక్షి మాలిక్ నిరసనలలో చేరారు. సింగ్‌పై చర్య తీసుకోకపోతే తమ పతకాలను తిరిగి ఇస్తామని బెదిరించారు. ఈ ఉద్యమం ప్రతిపక్ష పార్టీలు, రైతు సంఘాల నుంచి మద్దతు పొందింది. రెజ్లర్లపై లైంగిక వేధింపుల గురించి చాలా మంది ప్రజలు తమ ఆందోళనలను వ్యక్తం చేశారు. సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలపై ఆయనను ప్రస్తుతం పోలీసులు విచారణ చేస్తున్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం ఆరోపణల తీవ్రతను గుర్తించింది. అయితే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సహా అధికార పార్టీ నాయకులు మౌనంగా ఉన్నారు.

ఆ పాట అందరికీ నచ్చుతుంది: చిరు

హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవి హీరోగా మెహర్ రమేశ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భోళాశంకర్ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇటీవల ఓ పాట చిత్రీకరణ కోసం చిత్రబృందం భూతల స్వర్గంగా చెప్పబడే స్విట్జర్లాండ్‌కు వెళ్లింది. దీనిపై చిరంజీవి సమాచారం అందించారు. స్విట్జర్లాండ్‌లో కళ్లు చెదిరే అందాలతో మైమరిపించే ప్రదేశాల్లో 'భోళాశంకర్' కోసం తమన్నాతో ఆట పాట ఎంతో ఆహ్లాదంగా జరిగిందని వెల్లడించారు. ఈ పాట ప్రేక్షకులందరికీ నచ్చుతుందని, అభిమానులను మరింత మెప్పిస్తుందని చెప్పగలనని మెగాస్టార్ ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే మరిన్ని సంగతులు పంచుకుందాం అంటూ ట్వీట్ చేశారు. అప్పటివరకు ఈ చిరు లీక్స్ పిక్స్ అంటూ చమత్కరించారు. స్విస్ లొకేషన్స్ కు సంబంధించిన కొన్ని స్టిల్స్‌ను కూడా చిరంజీవి పంచుకున్నారు.

శరవేగంగా బాలయ్య సినిమా చిత్రీకరణ



హైదరాబాద్: నటసింహం బాలకృష్ణ తన 108వ సినిమా పనులతో తీరిక లేకుండా ఉన్నారు. సన్ షైన్ స్క్రీన్ వారు నిర్మిస్తున్న ఈ సినిమాకి, అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాలో బాలయ్య సరసన నాయికగా కాజల్ నటిస్తుండగా, ఆయన కూతురు పాత్రలో శ్రీలీల కనిపించనుంది. తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే కథ ఇది. ఇప్పటికే ఈ సినిమా కొంతవరకూ చిత్రీకరణను జరుపుకోగా తాజా షెడ్యూల్ హైదరాబాద్ - నానక్ రామ్ గూడా పరిసర ప్రాంతాల్లో ప్లాన్ చేశారు. అక్కడ బాలయ్య - కాజల్ మధ్య కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్టుగా సమాచారం. తమన్ ఈ సినిమాకి సంగీతాన్ని సమకూర్చుతున్నాడు. 'అఖండ', 'వీరసింహారెడ్డి' వంటి భారీ హిట్స్ తరువాత బాలయ్య నుంచి వస్తున్న సినిమా కావడంతో, సహజంగానే భారీ అంచనాలు ఉన్నాయి. ఇక అనిల్ రావిపూడి నుంచి ఇంతవరకూ వచ్చిన ప్రతి సినిమా హిట్టే కావడం కూడా ఈ సినిమాపై అంచనాలు పెరగడానికి కారణమవుతోంది. దసరాకి ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు యోచిస్తున్నారు.

రెండు స్థానాల కోసం పది జట్లు

ఆసక్తికరంగా వన్డే ప్రపంచకప్ అర్హత మ్యాచ్‌లు

లండన్: భారత్‌లో ఈ ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ అర్హత పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. టోర్నీలో పాల్గొనేందుకు మొత్తం 10 జట్లకు అవకాశం ఉండగా... ఇప్పటికే ఎనిమిది జట్లు అర్హత సాధించాయి. మిగిలిన రెండు స్థానాల కోసం మాత్రం పది జట్లు పోటీ పడుతుండగా వీటిలో ఒకప్పటి మేటి జట్టు వెస్టిండీస్, గత ఏడాది ఆసియా కప్ విజేత శ్రీలంక జట్టు, జింబాబ్వే జట్టు కూడా ఉన్నాయి. దీంతో అర్హత పోటీలు ఆసక్తికరంగా మారాయి. జూన్ 18వ తేదీ నుంచి జింబాబ్వేలో క్వాలిఫయర్ పోటీలు మొదలుకానున్నాయి. హరారే స్పోర్ట్స్ క్లబ్, క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్, టకషింగ క్రికెట్ క్లబ్... ఈ మూడు స్టేడియాల్లో మ్యాచ్‌లు జరగున్నాయి. 'ఐసీసీ పురుషుల వరల్డ్ కప్ కౌంట్‌డౌన్ తుది అంకానికి చేరింది. వన్డే క్రికెట్‌లో అత్యుత్తమమైన ఈ టోర్నీకి అర్హత సాధించేందుకు పది జట్లకు ఇదొక మంచి అవకాశం అని' అని ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జియోఫ్ అల్లర్డైస్ తెలిపాడు. కాగా ఐసీసీ ఇటీవల క్వాలిఫయర్ షెడ్యూల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే.

ఆ 10 జట్లు ఇవే...

ఐసీసీ మెగా టోర్నీ అయిన వన్డే ప్రపంచకప్ అర్హత కోసం ఈసారి ఎన్నడూ లేనంత పోటీ ఉంది. వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే వంటి పెద్ద జట్లతో పాటు నేపాల్, ఐర్లాండ్, స్కాట్లాండ్, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నెదర్లాండ్స్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా వంటి చిన్న జట్లు ఈ పోటీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. పది జట్లను 5 చొప్పున రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. గ్రూప్ 'ఎ'లో వెస్టిండీస్, జింబాబ్వే, నేపాల్, నెదర్లాండ్స్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా జట్లు ఉండగా, గ్రూప్ 'బి'లో శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్లు ఉన్నాయి. ప్రతి గ్రూప్ నుంచి టాప్- 3లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్ దశకు వెళ్లాయి. సూపర్ సిక్స్‌లో అద్భుత ప్రదర్శన చేసిన రెండు జట్లు జులై 9న హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో ఫైనల్ మ్యాచ్ ఆడతాయి. ఫైనల్ చేరిన రెండు జట్లు 2023 వన్డే ప్రపంచకప్-2023 టోర్నీకి అర్హత సాధించనున్నాయి. కాగా సొంత దేశంలో క్వాలిఫయర్ పోటీలు జరగుతుండడం జింబాబ్వేకు కలిసిరానుంది. అయితే మాజీ చాంపియన్లు వెస్టిండీస్, శ్రీలంక నుంచి ఆ జట్టుకు గట్టి పోటీ ఎదురుకానుంది.

'ప్లేఆఫ్స్' నం.1 బ్యాటర్ రైనా

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 16వ సీజన్ మరి కొద్ది రోజుల్లో ముగియనుంది. ఈ సీజన్‌లో ఎన్నో రికార్డులు బద్దలయ్యాయి. టీమ్ స్కోర్ల పరంగా, సెంచరీల సంఖ్య పరంగా, సిక్సర్‌లు, బౌండరీల సంఖ్యపరంగా ఇలా లెక్కలేనన్ని రికార్డులు ఈ ఐపీఎల్ సీజన్‌లో నమోదయ్యాయి. ఇక రెండు క్వాలిఫయర్ మ్యాచ్‌లు, ఒక ఎలిమినేటర్, చివరగా ఫైనల్ మ్యాచ్‌తో సీజన్ ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు అన్ని సీజన్‌ల ప్లే ఆఫ్‌లలో కలిపి అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్ ఎవరనే ప్రశ్న తలెత్తింది. గణాంకాలను పరిశీలిస్తే సీఎస్కే మాజీ ఆల్‌రౌండర్ సురేశ్ రైనా పేరిట ఆ రికార్డు ఉంది. ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లో మొత్తం 24 ఇన్నింగ్స్ ఆడిన సురేశ్ రైనా 714 పరుగులతో అగ్ర స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత 21 ఇన్నింగ్స్ ఆడి 522 పరుగులతో సీఎస్కే కెప్టెన్ ఎంఎస్ ధోని రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ సీజన్ ప్లే ఆఫ్స్‌లో భారీ స్కోర్‌లు సాధిస్తే ధోని టాప్ ప్లేస్‌లోకి వెళ్లే అవకాశం ఉంది. ఇక వీరి తర్వాత షేన్ వాట్సన్ 12 ఇన్నింగ్స్‌లో 389 పరుగులు, మైఖేల్ హస్సీ 11 ఇన్నింగ్స్‌లో 388 పరుగులు, డూప్లెసిస్ 14 ఇన్నింగ్స్‌లో 373 పరుగులతో వరుసగా 3, 4, 5వ స్థానాల్లో ఉన్నారు.

ధోనీని స్నేహితుడిగా చూస్తా: హార్దిక్ పాండ్యా

న్యూదిల్లీ: చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) జట్టు కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనిపై గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. చాలా మంది జనాలు ధోని ఎప్పుడూ సీరియస్‌గా ఉంటాడని భావిస్తారని, వాస్తవానికి ఆయన అలాగే ఉంటాడని హార్దిక్ చెప్పాడు. కానీ తనతో మాత్రం సీరియస్‌గా ఉండడని, ఇద్దరం జాలీగా మాట్లాడుకుంటామని తెలిపాడు. నేను మాత్రం ధోని మీద జోకులు కూడా వేస్తానని, ఆయనతో సరదాగా ఉంటానని హార్దిక్ పేర్కొన్నాడు. నేను ఆయనను మహేంద్రసింగ్ ధోనిగా చూడనని, ఒక ప్రియమైన స్నేహితుడిగా, నాతో ఎప్పుడూ నవ్వుతూ ఉండే ఒక సోదరుడిగా చూస్తానని చెప్పాడు. ధోనీ చాలా మంచి వ్యక్తి అని, ఆయనను ద్వేషించాలంటే మీరు కచ్చితంగా ఒక దెయ్యమై ఉండాల్సి ఉంటుందని హార్దిక్ పాండ్యా వ్యాఖ్యానించాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.